సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం ◊ 8 ◊ నవంబర్ ◊ 2023



‘నోటా’ నొక్కుడే..

ఎన్నికల్లో అభ్యర్థులెవరూ నచ్చకపోతే పోలింగ్‌కు దూరంగా ఉండాల్సిన పనిలేదు. అందు కోసం ఈసీ నోటాను ప్రవేశపెట్టింది. IIలో



సీఎం సభకు తరలిరావాలి

ఈనెల 13న దమ్మపేటలో నిర్వహించే సభకు సీఎం కేసీఆర్ వస్తున్నారని, విజయవంతం చేయాలని ఎంపీ నామా కోరారు. IIలో

గరిష్టం / కనిష్టం
31° / 22°

వాతావరణం

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారం సందర్భంగా అభయాంజనేయ స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రంగాకిరణ్



రంగాకిరణ్

చుంచుపల్లి: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా కె.వి.రంగాకిరణ్‌ను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి మంగళవారం నియమించారని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం రంగాకిరణ్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కొనసాగుతున్నారు. గతంలో జిల్లా అధ్యక్షుడిగా ఉన్న కోనేరు సత్యనారాయణ ఈ ఏడాది ఆగస్టు 24న బీఆర్‌ఎస్‌లో చేరడంతో నాళ్ల సోమసుందర్‌ను జిల్లా సమన్వయకర్తగా నియమించారు. రెండు నెలలుగా ఖాళీగా ఉన్న జిల్లా అధ్యక్ష పదవిని ఇప్పుడు రంగాకిరణ్‌తో భర్తీ చేశారు.

రక్షణ నియమాలు పాటించాలి



పరికరాలను పరిశీలిస్తున్న అధికారులు

మణుగూరు టౌన్: నిరంతర బొగ్గు రవాణా ప్రక్రియలో ఎలాంటి ఆటంకాలు లేకుండా, పని ప్రదేశాల్లో ప్రమాదాలకు తావివ్వకుండా రక్షణ నియమాలు పాటించాలని సింగరేణి జీఎం(ఈఅండ్‌ఎం) వై.రఘురామిరెడ్డి అన్నారు. 54వ రక్షణ వారోత్సవాల సందర్భంగా మంగళవారం మణుగూరు ఏరియాలోని కేసీహెచ్‌పీలో పర్యటించి బొగ్గు రవాణా ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బ్రేక్ డౌన్ లేకుండా తగిన పనిముట్లు దగ్గర ఉంచుకోవాలని కార్మికులకు, అధికారులకు సూచించారు. వాయు కాలుష్యం నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం సామూహిక రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధికారులు వీసం కృష్ణయ్య, నర్సిరెడ్డి, వెంకటరమణ, మదన్ నాయక్, రాంబాబు, నరేంద్రకుమార్, శ్రీనివాస్, ఆంజనేయ ప్రసాద్, శ్రీనివాసరావు, కేశవరెడ్డి పాల్గొన్నారు. బోడిపల్లి వెంకటేశ్వర్లు బృందం ప్రదర్శించిన నాటిక అలరించింది.

జనసేన అభ్యర్థుల ఖరారు

కొత్తగూడెంలో లక్కినేని, అశ్వారావుపేటకు ఉమాదేవి



లక్కినేని సురేందర్‌రావు



ముయ్యబోయిన ఉమాదేవి

చుంచుపల్లి/అశ్వారావుపేటరూరల్ : బీజేపీతో పొత్తులో భాగంగా జిల్లాలోని కొత్తగూడెం, అశ్వారావుపేట స్థానాలకు జనసేన పార్టీ మంగళవారం అభ్యర్థులను ప్రకటించింది. కొత్తగూడెం నియోజకవర్గం నుంచి లక్కినేని సురేందర్‌రావు, అశ్వారావుపేటకు ముయ్యబోయిన ఉమాదేవి పేర్లను వెల్లడించింది. ఇప్పటికే భద్రాచలం, పినపాక, ఇల్లెందు స్థానాలకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే.

కాంగ్రెస్‌లో టికెట్ల మంట!



పాల్వంచలో ఆందోళన చేస్తున్న ఎడవల్లి కృష్ణ, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు

మూడో జాబితా వెల్లడితో చెలరేగిన అసమ్మతి

- ‘పేట’లో తాటికి చెయ్యిచ్చిన అధిష్టానం
- వెంకటేశ్వర్లుతో టచ్‌లోకి వచ్చిన బీఆర్‌ఎస్
- సీపీఐకి ఇవ్వడంతో ‘గూడెం’లో అసమ్మతి
- ఇల్లెందులోనూ తప్పని రెబల్ బెడద

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మూడో జాబితా హస్తం నేతల్లో మంటలు పుట్టిస్తోంది. టికెట్ ఆశించి భంగపడ్డ నేతలు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. కష్టకాలంలో పార్టీని అంటిపెట్టుకుని ఉన్న తమకు అన్యాయం జరిగిందంటూ అసమ్మతి గళం విప్పుతున్నారు. కాంగ్రెస్‌లో నెలకొన్న పరిస్థితులను ఆసరాగా చేసుకున్న ప్రత్యర్థి పార్టీలు, తమ పార్టీలోకి రావాలంటూ వారిని ఆహ్వానిస్తున్నాయి.

చేజారిన తాటి ఆశలు

అశ్వారావుపేట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసే అవకాశం లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు నమ్మకం పెట్టుకున్నారు. గతంలో బూర్గంపాడు, అశ్వారావుపేట నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా పని చేశారు. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత ‘కారు’ దిగి కాంగ్రెస్‌లో చేరారు. గత అనుభవం, పార్టీలో ఉన్న పరిచయాల దృష్ట్యా మరోసారి తనకు అధిష్టానం టికెట్ కేటాయిస్తుందనే ఆశతో ఉన్నారు. అయితే అధిష్టానం ఇక్కడ హస్తం గుర్తుపై పోటీ చేసే అవకాశం జారే ఆదినారాయణకు ఇచ్చింది. ఇది తాటి వెంకటేశ్వర్లు, ఆయన మద్దతుదారులకు మింగుడుపడటం లేదు. మరోవైపు టికెట్ దక్కని తాటితో బీఆర్‌ఎస్ నేతలు చర్చలు ప్రారంభించారు. తమ పార్టీలోకి రావాలంటూ ఆహ్వానం పంపారు. మంత్రి హరీశ్‌రావు సమక్షంలో గులాబీ కండువా కప్పుకోవాలని కోరారు. అయితే తాటి నుంచి బీఆర్‌ఎస్‌కు ఇంకా గ్రీన్ సిగ్నల్ రాలేదు. ఈ అంశంపై తాటి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తనకు టికెట్ కేటాయించకపోవడం బాధాకరమన్నారు. తమ పార్టీలోకి రావాలంటూ ఇప్పటికయితే బీఆర్‌ఎస్ నుంచి ఆహ్వానం అందిందని, తదుపరి కార్యాచరణ ఏంటనే అంశంపై తమ వాళ్లతో చర్చిస్తున్నానని, వారి అభిప్రాయానికి అనుగుణంగా నిర్ణయం ఉంటుందని వెల్లడించారు.

చివరకు కనకయ్యకే..

రాష్ట్రం మొత్తంలో ఇల్లెందు సీటు కాంగ్రెస్ పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది. ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు ఏకంగా 32 మంది అభ్యర్థులు గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అయితే అందరి కంటే టికెట్ అవకాశాలు జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్యకే ఎక్కువనే అభిప్రాయం అందరిలోనూ నెలకొంది. ఇక కాంగ్రెస్ ఎన్నికల కమిటీ స్క్రీనింగ్ ప్రక్రియ మొదలుపెట్టిన తర్వాత బంజారాలకు సామాజిక న్యాయం అంశం తెరపైకి వచ్చింది. కోయలతో సమానంగా బంజారాలకు టికెట్ కేటాయించాలనే డిమాండ్‌ను బలంగా వినిపించారు. ఆ వర్గానికి చెందిన కేంద్ర మాజీమంత్రి బలరాంనాయక్‌తో పాటు ప్రవీణ్‌నాయక్, గుగులోత్ రవి, శంకర్‌నాయక్, భూక్యా దళ్‌సింగ్ తదితరులు టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. తమకు టికెట్ ఇవ్వలేని పక్షంలో కాంగ్రెస్‌లో సీనియర్ నేతగా ఉన్న చీమల వెంకటేశ్వర్లుకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే పార్టీ చివరకు కోరం కనకయ్య వైపే మొగ్గు చూపింది. దీంతో కామేపల్లి జెడ్పీటీసీగా ఉన్న ప్రవీణ్‌నాయక్ రెబల్‌గా పోటీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరోవైపు చీమల వెంకటేశ్వర్లు ఇప్పటికే ఒక సెట్ నామినేషన్ వేశారు. మిగిలిన నేతలు సైతం ఈ అంశంపై చర్చించి తదుపరి కార్యాచరణకు సిద్ధమవుతున్నారు.

ఎడవల్లి ఆశలు గల్లంతు

గత మూడేళ్లుగా కొత్తగూడెం టికెట్ లక్ష్యంగా ఎడవల్లి కృష్ణ కాంగ్రెస్ పార్టీ తరఫున పని చేసుకుంటూ పోతున్నారు. మధ్యలో మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, నాగ సీతారాములు నుంచి టికెట్ విషయంలో పోటీ ఎదురైనా కాంగ్రెస్ పెద్దలపైనే నమ్మకం పెట్టుకున్నారు. కొత్తగూడెం టికెట్ బీసీలకే కేటాయించాలంటూ గట్టిగా తన వాణి వినిపించారు. పొత్తుల అంశం తెర మీదకు రానంత వరకు కొత్తగూడెం సీటు ఎడవల్లి కృష్ణకే అనే ప్రచారం బయట, పార్టీ అంతర్గత చర్చల్లోనూ బాగా జరిగింది. కమ్యూనిస్టులతో పొత్తులు విచ్చుకుపోతున్నాయనే తరుణంలోనూ ఎడవెల్లికే టికెట్ అన్నట్టుగా పరిస్థితి ఉండేది. అనేక తర్జనభర్జనల అనంతరం కొత్తగూడెం టికెట్ సీపీఐకి పోయింది. దీంతో ఎడవల్లి కృష్ణ భగ్గుమంటున్నారు. ప్రెస్‌మీట్ పెట్టి మరీ తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ‘బీసీలకు కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసింది. కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తా. కొత్తగూడెంలో సీపీఐ ఓడిపోవడం ఖాయం, కనీసం డిపాజిట్ కూడా రాదు’ అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

కాంగ్రెస్‌కు ‘తాటి’ రాజీనామా

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవికి, కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి మంగళవారం రాత్రి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఈ మెయిల్ ద్వారా పంపినట్లు తెలిపారు. అశ్వారావుపేట కాంగ్రెస్ టికెట్ తనకు కాకుండా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడు జారే ఆదినారాయణకు ఇవ్వడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. కొన్నేళ్లుగా పార్టీని నమ్మి పని చేసిన నాయకులు, కార్యకర్తలకు న్యాయం జరగదలేదని, డబ్బు ఉన్న వారికే టికెట్లు, పదవులు వస్తున్నాయని ఆయన వాపోయారు.

సీపీఐకి డిపాజిట్ దక్కదు

పాల్వంచ: కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా కొత్తగూడెం సీటు సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావుకు ఇచ్చారని, కానీ ఆయనకు డిపాజిట్ కూడా దక్కదని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. పాల్వంచలో మంగళవారం ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో బీసీలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ అభివృద్ధి కోసం తాను కష్టపడ్డానని, అయినా బీసీనైన తనను కాదని ఇక్కడ వేరే పార్టీకి ఇవ్వడం దారుణమని అన్నారు. రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క తనకు అన్యాయం చేశారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పార్టీ కొత్తగూడెం అసెంబ్లీ స్థానంతో పాటు రాజ్యసభ స్థానాన్ని బీసీలకు ఇస్తే కాంగ్రెస్ మాత్రం విస్మరించిందని ఆరోపించారు. అధిష్టానం నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని బీఫాం తనకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే బుధవారం నామినేషన్ వేస్తానని, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో నాయకులు నూకల రంగారావు, కొండెం వెంకన్న గౌడ్, రమేశ్, రాయల కాంతయ్య, మల్లికార్జున్, చారి, కరుణాకర్, బత్తుల వెంకటేశ్వరరావు, చంద్రగిరి సత్యనారాయణ, సునీల్, సోమయ్య, వీరయ్యచౌదరి పాల్గొన్నారు.

పటిష్ట ఏర్పాట్లు చేశాం

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రియాంక ఆల



వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక, ఎస్పీ వినీత్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల కోసం పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల తెలిపారు. ఎన్నికల అధికారులు, సిబ్బందికి మార్గదర్శకాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, ఎన్నికల పరిశీలకులు అజయ్ వి వినాయక్, దీపక్‌మిశ్రా, ఆర్. బాలకృష్ణన్, డీజీపీ అంజన్‌కుమార్, అదనపు సీఈఓలు లోకేష్‌కుమార్, సర్ఫరాజ్ అహ్మద్ తదితరులు మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి హాజరైన ప్రియాంక ఆల మాట్లాడుతూ.. జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. వీసీలో ఎస్పీ డాక్టర్ వినీత్, ఎన్నికల విభాగం తహసీల్దార్ దారా ప్రసాద్, డీటీ రంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల్లో రికార్డ్ చేయండి

- నామినేషన్ల స్వీకరణలో ఇబ్బందులు తలెత్తొద్దు
- జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం) : నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, ఆ ప్రక్రియను సీసీ కెమెరాల్లో రికార్డ్ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. మంగళవారం ఆమె కొత్తగూడెం రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నామినేషన్లు దాఖలు చేసే సమయంలో ఐదుగురిని మించి లోనికి అనుమతి ఇవ్వొద్దని, మూడు వాహనాలకు మాత్రమే పర్మిషన్ ఉందని చెప్పారు. ఇతరులను రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల లోపు వరకు అనుమతించొద్దని సూచించారు. పటిష్ట భద్రత కొనసాగించాలని చెప్పారు. నామినేషన్ వేసే వారికి అవసరమైన సలహాలు, సూచనల కోసం ప్రతి ఆర్‌ఓ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలన్నారు. నామినేషన్ల వివరాలను సీరియల్ నంబర్ వారీగా ప్రతి రోజూ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి శిరీష, డీఎస్పీ రెహమాన్, కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్లు పుల్లయ్య, నాగరాజు, శిరీష, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లాలో 14 నామినేషన్లు దాఖలు



ఇల్లెందులో నామినేషన్ వేస్తున్న కోరం కనకయ్య

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా వ్యాప్తంగా మంగళవారం 14 నామినేషన్లు దాఖలయ్యాయి. భద్రాచలం నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థులు మారం తిరుపతమ్మ, ధర్మసమాజ్ పార్టీ నుంచి రవ్వ భద్రమ్మ, ఇల్లెందులో కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య, గుగులోత్ రవి, ఆంగోత్ దామోదర్ కుమార్, బీజేపీ నుంచి ధారావత్ రవీందర్ నాయక్, విద్యార్థుల రాజకీయ పార్టీ నుంచి లకావత్ ప్రసాద్, బీఆర్‌ఎస్ నుంచి బానోత్ హరిప్రియ తరఫున ఒకరు నామినేషన్ వేశారు. పినపాక నుంచి ఈసం కృష్ణ, పూనెం రంగయ్య, కొత్తగూడెం నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా మాళోత్ శ్రీనివాస్, కల్తి లెనిన్, జనసేన నుంచి లక్కినేని సురేందర్‌రావు, బీజేపీ నుంచి సూరెడ్డి రమణారెడ్డి నామినేషన్లు వేశారు.

నేడు కూనంనేని నామినేషన్

హాజరుకానున్న సీపీఐ నేత నారాయణ, తమ్మినేని, పొంగులేటి

జంగ్ తెలంగాణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): సీపీఎం, కాంగ్రెస్, ఇతర ప్రజాసంఘాలు బలపర్చిన సీపీఐ కొత్తగూడెం నియోజకవర్గ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు బుధవారం నామినేషన్ వేస్తారని పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీదేవిపల్లి మార్కెట్‌యార్డు నుంచి ఆర్డీ ఓ కార్యాలయంవరకు ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. నామినేషన్ కార్యక్రమానికి సీపీఐ జాతీ య కార్యదర్శి కె.నారాయణ, కాంగ్రెస్ ప్రచార కమి టీ కో కన్వీనర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేనివీరభద్రం, కాంగ్రెస్ నాయకులు పోట్ల నాగేశ్వరరావు, నాగా సీతారాములు, సీ పీఐ నాయకులు పోటు ప్రసాద్, బి.అయోధ్య, రావులపల్లి ప్రసాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య తదితరులు హాజరవుతారని వివరించారు.

కళాత్మక నైపుణ్యాలను వెలికితీయాలి



జానపద నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థుల్లో దాగి ఉన్న కళాత్మక నైపుణ్యాలను వెలికితీయాలని జిల్లా విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి ఎస్‌కే సైదులు అన్నారు. సీఈఆర్‌టీ(పాపులేషన్ సెల్), విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సింగరేణి ఉన్నత పాఠశాలలో జానపద, నృత్య పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో చదువుతోపాటు కళాత్మక నైపుణ్యాలను కూడా పెంపొందించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. పోటీలకు జిల్లా నలుమూలల నుంచి ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలకు చెందిన 8, 9 తరగతుల విద్యార్థులు హాజరయ్యారు. వారు ప్రదర్శించిన జానపద, గ్రూప్ డ్యాన్స్‌లు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థిని ఈనెల 10న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని నిర్వాహకులు తెలిపారు. అనంతరం విజేతలకు జిల్లా క్వాలిటీ కో ఆర్డినేటర్ నాగరాజశేఖర్ బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతగా వెంకటశ్యామ్ వ్యవహరించగా, సింగరేణి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మీడియాకూ పోస్టల్ బ్యాలెట్ అవకాశం

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కవరేజీలో పాల్గొనే పాత్రికేయులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఆయా నియోజకవర్గ పరిధిలోని పాత్రికేయులు సంబంధిత రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఫారం12 – డీ పూర్తిచేసి ఈనెల 8వ తేదీ లోగా తమ కార్యాలయంలో అందజేయాలని డీపీఆర్‌ఓ శీలం శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫారంతోపాటు అక్రెడిటేషన్ కార్డు, ఎన్నికల గుర్తింపు కార్డు జిరాక్స్‌లతో పాటు ఓటరు జాబితాలోని సీరియల్‌నంబర్ నమోదు చేయాలని కోరారు.

కర్మాగారాల్లో భద్రత చర్యలు చేపట్టాలి



కేటీపీఎస్ కర్మాగారాన్ని పరిశీలిస్తున్న మోహన్ బాబు

పాల్వంచ : కర్మాగారాల్లో భద్రతా చర్యలు పాటించాలని జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎం.మోహన్‌బాబు అన్నారు. మంగళవారం ఆయన కేటీపీఎస్ 5, 6 దశల కర్మాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా క‌ర్మాగారంలోని పలు విభాగాల్లో పర్యటించి రక్షణపై తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. అనంతరం ఐటీ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. భద్రతపై పలు సూచనలు చేశారు. కర్మాగారాలు దేవాలయాలతో సమానమని అన్నారు. ఎలాంటి అవాంతరాలు వాటిల్లకుండా ముందస్తు ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకర్‌రావు, ఎస్‌ఈలు జి.వి.ధర్మారావు, పి.కృష్ణ, బి.మోక్షవీర్, డి.వరప్రసాద్, డీఈ ఎస్.సమ్మయ్య, ఏడీఈ ఎస్.నాగయ్య, శేషసాయి, భాగం రాధాకృష్ణ, ఏఈ నాగరాజు, రజినీ పాల్గొన్నారు.

మిగిలింది పోరే..

- ఎట్టకేలకు ఉత్కంఠకు తెరదించిన కాంగ్రెస్
- ఆ పార్టీ నుంచి తొమ్మిది మంది అభ్యర్థులు
- పొత్తులో సీపీఐకి కొత్తగూడెం కేటాయింపు
- ఒంటరిగానే ఎనిమిది స్థానాల్లో స్థానాల్లో సీపీఎం
- పదికి పది స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు ఖరారు కావడంతో ఉమ్మడి జిల్లాలోని పది స్థానాల్లో అసలైన పోరుకు తెర లేచింది. రెండున్నర నెలల క్రితమే బీఆర్‌ఎస్ పది మంది అభ్యర్థులను ప్రకటించగా అప్పటినుంచే ప్రచారాన్ని పరుగులెత్తిస్తున్నారు. సుదీర్ఘ కసరత్తు అనంతరం మూడు విడతల్లో కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా విడుదల చేశారు. సోమవారం రాత్రి మూడో జాబితాలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని తొమ్మిది స్థానాల అభ్యర్థుల ప్రకటన పూర్తయింది. పొత్తులో భాగంగా సీపీఐకి కొత్తగూడెం స్థానాన్ని కేటాయించగా అభ్యర్థులు ప్రజాక్షేత్రంలోకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అలాగే, సీపీఎం ఒంటరిగానే ఎనిమిది స్థానాల్లో పోటీ చేయనున్నట్లు ప్రకటించింది. ఇక బీజేపీ కూడా ఐదు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా.. మిగిలిన స్థానాలకు నేడో, రేపు ప్రకటించే అవకాశముంది. ఇవేకాక మరికొన్ని పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు అస్త్రశస్త్రాలతో ఎన్నికల రంగంలోకి దిగుతున్నారు.

అన్నింటా బీఆర్‌ఎస్

ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు బరిలోకి దిగారు. ఇప్పటికే ప్రచారాన్ని కదం తొక్కిస్తుండగా.. ఐదు చోట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ సభలు నిర్వహించారు. మరోపక్క అభ్యర్థులు సుడిగాలి పర్యటనల ద్వారా ప్రజలను కలుస్తున్నారు. ఆత్మీయ సమ్మేళనాలు, కార్యకర్తలతో సమావేశాలకు హాజరవుతూ ప్రచార సరళిపై సూచనలు చేస్తున్నారు.

‘చేయి’ కలిపిన కంకి కొడవలి..

కాంగ్రెస్, వామపక్షాల మధ్య పొత్తుపై చర్చల పరంపర కొనసాగినా అంతటా ఫలప్రదం కాలేదు. ఒక దశలో పొత్తు ఉంటుందా, ఉండదా, ఉంటే తమకు టికెట్ వస్తుందా, లేదా అని ఆశావహులు ఆందోళన చెందారు. పొత్తుల సంగతి ఎటూ తేలక పోవడంతో కాంగ్రెస్‌కు సీపీఎం టాటా చెప్పేసింది. సీపీఐ మాత్రం పొత్తులో భాగంగా కొత్తగూడెం నుంచి బరిలో దిగుతుండగా.. మిగిలిన తొమ్మిది స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు పోటీకి సిద్ధమయ్యారు.

ఒంటరిగానే సీపీఎం..

ఏ పార్టీతో పొత్తు లేకుండానే రాష్ట్రంలోని 19 స్థానాల్లో.. ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది స్థానాల్లో పోటీకి సీపీఎం సిద్ధమైంది. పాలేరు నుంచి పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సహా ఖమ్మం, సత్తుపల్లి, వైరా, మధిర, భద్రాచలం, అశ్వారావుపేట, ఇల్లెందు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. నామినేషన్ దాఖలు తర్వాత నియోజకవర్గాల్లో ప్రచారాన్ని ఉధృతం చేయనున్నట్లు తెలిసింది. పాలేరులో తమ్మినేని బరిలో దిగగా, రాష్ట్ర, జాతీయ నేతలతో ప్రచారం చేయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఆ పార్టీలు కూడా..

ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐతోపాటు బీజేపీ, బీఎస్పీ, ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు కూడా ఉమ్మడి జిల్లాలో పోటీకి సిద్ధమయ్యారు. ఇప్పటికే బీజేపీ ఇల్లెందు, భద్రాచలం, పినపాక, పాలేరు, సత్తుపల్లిల్లో అభ్యర్థులను ప్రకటించింది. అయితే, ఈ పార్టీలు చూపే ప్రభావం ఎంత, ఎంత మేర ఓట్లను చీలుస్తారనే అంశంపై ప్రధాన పార్టీలు లెక్కలేస్తున్నాయి. ఈనెల 10న నామినేషన్ల ప్రక్రియ ముగియనుండగా, పరిశీలన, ఉపసంహరణ అనంతరం పోటీలో మిగిలే అభ్యర్థులపై స్పష్టత వస్తుంది. అయినా ఈలోపు ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు.



కొత్తతండాలో నేలవాలిన వరి పంట

భారీ వర్షం.. పంటలకు నష్టం

టేకులపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. టేకులపల్లిలో వరద నీరు రోడ్డుపై ప్రవహించింది. ఆయా గ్రామాల్లో మొక్కజొన్న, మిర్చి, వరి పంటలు భారీ వర్షం, ఈదురు గాలుల ధాటికి నేలవాలాయి. పంటలు నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



మద్రాస్‌తండాలో పడిపోయిన మిరప చెట్లు

ఇండియా.. ది గ్రేట్!

- వయోజనులందరికీ ఓటు హక్కు

వైరా: భారత రాజ్యాంగంలోని అధికరణం 326 ప్రకారం సార్వత్రిక ఓటు హక్కు కల్పించారు. అంటే 18 ఏళ్లకు తక్కువ కాని ప్రతీ భారతీయ పౌరుడు లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. 1950 నుంచి దేశంలో అమల్లోకి వచ్చిన సార్వత్రిక వయోజన ఓటు హక్కు ప్రపంచ రాజకీయ చరిత్రలోనే ఎంతో విప్లవాత్మకమైన చర్యగా చెబుతారు. ముఖ్యంగా సార్వత్రిక ఓటు హక్కు చరిత్రను పరిశీలిస్తే.. అనేక దేశాల్లో అమలుకావడానికి వందల ఏళ్లు పట్టింది. భారత్‌లో సార్వత్రిక ఓటు హక్కు ప్రవేశపెట్టే నాటికి గ్రీస్, ఆస్ట్రేలియా, స్విట్జర్లాండ్, దక్షిణాఫ్రికా వంటి దేశాల్లో కొన్ని కొన్ని వర్గాల వారికి ఓటు హక్కు లేదు. చాలా దేశాల్లో ప్రజలందరికీ వారికి నచ్చిన ప్రభుత్వాలను ఎన్నుకునే హక్కు ఇంకా రాలేదు. అలా హక్కు సిద్ధించిన ప్రజాస్వామిక దేశాల్లో కూడా చాలా కాలం పాటు సార్వత్రిక ఓటు హక్కు అంటే కేవలం పురుషులకు మాత్రమే ఉండేది. కొన్ని దేశాల్లో ఓటు హక్కు ధనికులకు పరిమితమైంది. కానీ, మన దేశంలో మాత్రం జాతి, మతం, కులం, భాష, లింగంతో నిమిత్తం లేకుండా భారత పౌరులందరికీ ఓటు హక్కు ఉంటుంది. తద్వారా పౌరులు తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసి ప్రభుత్వ నిర్మాణంలో పాలు పంచుకోవచ్చు.

హలో.. నమస్తే అండీ!

- ఓటర్లను ఆకట్టుకునేలా 'ఫోన్ ఇన్'

నేలకొండపల్లి: అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంటోంది. ఈ నేపథ్యాన ఆత్మీయ సమ్మేళనాలు, సభల నిర్వహణతో పాటు ఓటర్లను నేరుగా కలుస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఇవన్నీ కాకుండా ఓటర్ల ఫోన్ నంబర్లు సేకరించి వాయిస్ రికార్డు ద్వారా తమకు ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. 'హలో.. నమస్తే అండీ.. నేను ఫలానా పార్టీ అభ్యర్థిగా బరిలో ఉన్నాను.. నాకు ఓటు వేసి గెలిపించండి' అంటూ విన్నవిస్తున్నారు. అయితే, కొందరు వాయిస్ రికార్డుల ద్వారా ఓట్లు అభ్యర్థిస్తుండగా.. మరికొందరు అభ్యర్థులు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించుకుని ఫోన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడిప్పుడే ఫోన్లు వస్తుండగా.. పోలింగ్ సమీపించే కొద్ది ఎన్ని ఫోన్లు వస్తాయోనని ఓటర్లు బెంబేలెత్తుతున్నారు.

మద్యం, నగదు సీజ్

దమ్మపేట: ఎన్నికల నిబంధనల మేరకు చేస్తున్న తనిఖీల్లో మద్యం, నగదును పోలీసులు సీజ్ చేశారు. మంగళవారం మండలంలోని జమేదారుబంజర, మొద్దులగూడెం క్రాస్ రోడ్డు వద్ద, ద్విచక్ర వాహనాలపై అక్రమంగా తరలిస్తున్న 380 క్వార్టర్ సీసాలను ఎఫ్ఎస్ టీంహెడ్ కృష్ణ, పోలీసులు కలిసి స్వాధీనం చేసుకున్నారు. నాగుపల్లి చెక్‌పోస్ట్ వద్ద నిర్వహిస్తున్న వాహనాల తనిఖీల్లో ద్విచక్ర వాహనదారుడి నుంచి ఆధారాలు లేని రూ.1,30,155 నగదును స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న నగదు, మద్యం సీసాలను సీజ్ చేశామని పోలీసులు తెలిపారు.


భద్రాచలంలో..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం కూనవరంరోడ్డులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద అధికారులు మంగళవారం వేర్వేరు సమయాల్లో నగదును పట్టుకున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఓ వ్యక్తి తరలిస్తున్న రూ.72,500తో పాటు మరో వ్యక్తి నుంచి రూ.51,500ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఎవరూ నచ్చకపోతే.. 'నోటా' నొక్కుడే..

త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అభ్యర్థులు తమకే ఓటు వేయాలని విస్తృత ప్రచారం చేస్తున్నారు. అయితే, అభ్యర్థులెవరూ నచ్చకపోతే గతంలో చాలా మంది పోలింగ్‌కు దూరంగా ఉండేవారు. లేదంటే ఎవరికో ఒకరికి అన్నట్లుగా ఓటు వేసేవారు. కానీ, అభ్యర్థులెవరూ నచ్చకున్నా ఓటు వేసేలా ఎన్నికల సంఘం 2014 సంవత్సరం నుంచి 'నోటా' (నన్ ఆఫ్ ది ఎబో)ను ప్రవేశపెట్టింది. పోటీ చేసిన అభ్యర్థులెవరూ తమకు నచ్చలేదని చెప్పడం దీని ఉద్దేశం. – సుజాతనగర్

- గత ఎన్నికల్లో 17,872 ఓట్ల నమోదు
- 2014 ఎన్నికల్లో పోలిస్తే 7 వేలు పెరిగిన ఓట్లు



గతంలో ఎవరో ఒకరికి..

గతంలో పోటీలో ఉన్న అభ్యర్థుల్లో ఎవరో ఒకరికి ఓటు వేయాల్సి వచ్చేది. కానీ, తర్వాత అభ్యర్థులను తిరస్కరించేలా నోటాను ఈసీ ప్రవేశపెట్టింది. ప్రజల్లో రాజకీయ చైతన్యం పెరగంతో మంచి నాయకుడిని ఎన్నుకోవడం, లేదంటే ఎవరూ నచ్చలేదని అసంతృప్తి తెలియజేసేలా నోటా ఉపయోగపడుతోంది.

2018 ఎన్నికల్లో..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2018 ఎన్నికల్లో నోటాకు 17,872 ఓట్లు దక్కాయి. ఈ ఎన్నికల్లో అత్యధికంగా ఖమ్మంలో నోటాకు 3,513 ఓట్లు నమోదు కాగా, తక్కువగా పినపాకలో 868 ఓట్లు నమోదయ్యాయి. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే.. కొత్తగూడెం నియోజకవర్గంలో 15 మంది అభ్యర్థులు బరిలో నిలవగా కాంగ్రెస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావుకు 81,118 ఓట్లు సాధించారు. ఇక్కడ నోటాకు 1,103 ఓట్లు నమోదయ్యాయి. భద్రాచలంలో పది మంది అభ్యర్థులకు గాను పొదెం వీరయ్య 47,746 ఓట్లతో గెలవగా, నోటాకు 2,106 ఓట్లు వచ్చాయి. అశ్వారావుపేటలో 12 మంది బరిలో నిలవగా 61,124 ఓట్లు సాధించిన మెచ్చా నాగేశ్వరరావు గెలిచారు. ఇక్కడ నోటాకు 2,053 ఓట్లు పోలయ్యాయి. ఇల్లెందులో 16 మంది పోటీ చేయగా బానోత్ హరిప్రియ 70,644 ఓట్లు సాధించి గెలవగా, నోటాకు 1,915 ఓట్లు పడ్డాయి. పినపాక నియోజకవర్గంలో 16 మంది ఎన్నికల బరిలో నిలిస్తే రేగా కాంతారావు 72,283 ఓట్లు సాధించి విజయం సాధించారు. ఇక్కడ నోటాకు 868 ఓట్లు వచ్చాయి. ఇక ఖమ్మంలో 13 మంది పోటీ పడగా 1,02,760 ఓట్లు సాధించి పువ్వాడ అజయ్ విజయం దక్కించుకున్నారు. ఈ నియోజకవర్గంలో నోటాకు 3,513 ఓట్లు నమోదయ్యాయి. పాలేరులో 14 మంది బరిలో నిలిస్తే కందాల ఉపేందర్‌రెడ్డి 89,407 సాధించి గెలిచారు. ఇక్కడ నోటాకు 1,271 ఓట్లు వచ్చాయి. మధిర బరిలో 11 మంది నిలవగా 80,598 ఓట్లు సాధించిన మల్లు భట్టి విక్రమార్క విజయం సాధించారు. ఈ నియోజకవర్గంలో నోటాకు 1,011 ఓట్లు వచ్చాయి. వైరాలో 13 మందికి గాను స్వతంత్ర అభ్యర్థి లావుడ్యా రాములునాయక్ 52,650 ఓట్లు దక్కించుకుని గెలవగా, నోటాకు 2,360 ఓట్లు నమోదయ్యాయి. అలాగే, సత్తుపల్లిలో 11 మంది పోటీ పడితే 1,00,044 ఓట్లు సాధించిన సండ్ర వెంకటవీరయ్య విజయం సాధించారు. ఈ నియోజకవర్గంలో నోటాకు 1,672 ఓట్లు వచ్చాయి.

పెరిగిన ఓట్లు

2014 ఎన్నికలతో పోలిస్తే 2018 అసెంబ్లీ ఎన్నికల్లో నోటాకు నమోదైన ఓట్లు గణనీయంగా పెరిగాయి. అభ్యర్థులు అధిక సంఖ్యలో బరిలో ఉండటం, వారు ఇచ్చిన హామీల అమల్లో విఫలం కావటంతోనే ఇలా జరిగిందని అభిప్రాయపడుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాలకు గాను 2014 ఎన్నికల్లో నోటాకు 10,872 ఓట్లు నమోదయ్యాయి. అదే 2018 ఎన్నికలకు వచ్చే సరికి 17,872 ఓట్లు నమోదు కావడం గమనార్హం. ఇక ప్రస్తుత ఎన్నికల్లో నోటాకు ఎందరు ఓటేస్తారో వేచి చూడాల్సిందే.

గత రెండు ఎన్నికల్లో 'నోటా'కు నమోదైన ఓట్లు

2014	నియోజకవర్గం	2018
1,408	ఖమ్మం	3,513
783	పాలేరు	1,271
912	వైరా	2,360
730	మధిర	1,011
905	సత్తుపల్లి	1,672
1,356	కొత్తగూడెం	1,103
1,145	అశ్వారావుపేట	2,053
1,480	పినపాక	868
1,173	ఇల్లెందు	1,915
980	భద్రాచలం	2,106
10,872	మొత్తం	17,872

జంగ్ తెలంగాణ

సీఎం సభకు తరలిరావాలి

ఎంపీ నామా నాగేశ్వరరావు

అశ్వారావుపేట: అశ్వారావుపేట బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఈ నెల 13న దమ్మపేటలో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభకు వస్తున్నారని, ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఎంపీ నామా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్లలో కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు ఉన్నారు.

సభాస్థలి పరిశీలన..

దమ్మపేట: ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాటు చేసే స్థలాన్ని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, ప్రజా ప్రతినిధులు, నాయకులు మంగళవారం పరిశీలించారు. సభకు భారీగా జన సమీకరణ చేసి, సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జ్ ఉప్పల వెంకటరమణ, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రావు జోగేశ్వరరావుతోపాటు పైడి వెంకటేశ్వరరావు, దారా యుగంధర్, దారా మల్లికార్జున్‌రావు, అంకత మహేశ్వరరావు, చిన్నశెట్టి సత్యనారాయణ, యార్లగడ్డ బాబు, అబ్దుల్ జిన్నా పాల్గొన్నారు.



దమ్మపేట: సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ నామా, ఎమ్మెల్యే మెచ్చా, నాయకులు

దొరల పాలనకు చరమగీతం పాడుదాం

- కాంగ్రెస్ ప్రచార కమిటీ కోకన్వీనర్ పొంగులేటి
- పార్టీలో పలువురు ప్రజాప్రతినిధుల చేరిక

ఇల్లెందురూరల్: రాష్ట్రంలో దొరల పాలనకు చరమగీతం పాడి ప్రజాపాలనకు స్వాగతం పలుకుదామని కాంగ్రెస్ ప్రచార కమిటీ కోకన్వీనర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని రాఘబోయినగూడెం గ్రామ పంచాయతీ మొట్లగూడెంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్‌లు కుమ్మోత్ జానకీ, నూనావత్ తిరుపతి, పీఏసీఎస్ డైరెక్టర్ కుమ్మోత్ రాము, మరికొంత మంది స్థానికులు పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదనరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా అక్రమంగా సంపాదించిన సొమ్ముతో అసెంబ్లీ ఎన్నికల వేళ దొరల బంట్లు డబ్బు సంచులతో ప్రజల ముందుకు వస్తారని, వారు ఇచ్చిన డబ్బును తీసుకొని కాంగ్రెస్‌కు ఓటు వేయాలని సూచించారు. మహిళలకు నెలకు రూ.2,500, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, రూ.500కు వంట గ్యాస్, ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షలు వంటి అనేక సంక్షేమ పథకాలు కాంగ్రెస్ అమ్ముల పొదిలో ఉన్నాయని తెలిపారు. కోరం కనకయ్యను ఎన్నికల్లో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కోరం కనకయ్య మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, పులి సైదులు, యదళ్లపల్లి అనసూర్య, జాటోత్ ఝాన్సీ, పాయం స్వాతి, కల్తి పద్మ, శారద, మోకాళ్ల వెంకటమ్మ, మండల రాము, పూనెం సురేందర్, ముక్తి కృష్ణ, సూర్నపాక సత్యనారాయణ, తాటి భిక్షం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన కోరం కనకయ్య, తదితరులు

ప్రలోభాలకు తెర తీశారు..

- ఇతర పార్టీల్లో అసంతృప్తులపై కన్ను
- జోరుగా కొనసాగుతున్న చేరికలు

బూర్గంపాడు: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల పర్వం కొనసాగుతున్న నేపథ్యంలోనే పోటీలో నిలిచే ఆయా పార్టీల అభ్యర్థులు ఓటర్లను తమవైపునకు తిప్పుకునేందుకు అప్పుడే ప్రలోభాలకు తెర తీశారు. ఇంటింటి ప్రచారాలతో పాటుగా పదునైన వ్యూహాలతో బరిలో నిల్చున్న అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. అలకపాన్పులు ఎక్కిన సొంత పార్టీ నాయకులను, కార్యకర్తలను బుజ్జగిస్తున్నారు. వారు పార్టీ చేజారకుండా ప్రలోభాలకు గురిచేస్తున్నారు. వారికి తాయిలాలు, హామీలు ఇచ్చి తమవైపునకు తిప్పుకుంటున్నారు. గ్రామాల్లో ఇప్పటికే కులాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. వారికి భోజనాలు ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించి వారి కోర్కెలు వింటూ వాటిని అమలు చేస్తామని హామీలిస్తున్నారు. ఓ కులానికి ఓ పార్టీ అభ్యర్థి సమావేశం పెట్టి విందు భోజనాలు ఏర్పాటు చేస్తే, మరునాడే మరో అభ్యర్థి అక్కడే సమావేశం పెట్టి విందుభోజనాలు ఏర్పాటు చేసి ప్రత్యర్థులను మించి హామీలిస్తున్నారు. దీంతో అక్కడి ప్రజలు ఎవరు ఏ పార్టీలో ఉన్నారో తెలియని పరిస్థితులున్నాయి. ఒకరోజు ఓ పార్టీ కండువా కప్పుకున్న వాళ్లు మరునాడే మరో పార్టీ కండువా కప్పుకుంటున్నారు. ఆయా పార్టీల అభ్యర్థులు నిర్వహిస్తున్న సభలు, సమావేశాలు ఎన్నికల వ్యయం పరిధిలోకి రాకుండా తెలివిగా వ్యవహరిస్తున్నారు. వీరు సభలు నిర్వహిస్తున్న ప్రాంతంలో ఎవరిదో ఒకరి పుట్టినరోజని, పెళ్లిరోజని విందు భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు.



అసంతృప్తులపై నజర్

పార్టీల్లోని అసంతృప్తులపై ప్రత్యర్థిపార్టీల నాయకులు కన్నేస్తున్నారు. వారిని రహస్యంగా కలుసుకుని వారికి మద్దతుగా పనిచేయాలని కోరుతున్నారు. వారికి భారీ ఆశలు చూపించి తమవైపునకు తిప్పుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వారికి ప్రత్యేక ప్యాకేజీలు ఇచ్చి వారిని ప్రసన్నం చేసుకుంటున్నారు. ఒకవేళ పార్టీలోకి రాకున్నా అంతర్గతంగా తమకు మద్దతుగా ఓట్లు వేయించాలని కోరుతున్నారు. ఇప్పటికే ఆయా పార్టీల నాయకులు బూత్ స్థాయిలో ప్రచారాలకు రోజుకు రూ.10 వేల వరకు కార్యకర్తలకు ఖర్చుచేస్తున్నారు. నామినేషన్ల ఘట్టం పూర్తయిన తరువాత ప్రలోభాల పర్వం మరింత ఊపందుకోనుంది. ద్వితీయ శ్రేణి నాయకులు కార్నర్ మీటింగ్‌లు పెట్టి స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి హామీలిస్తున్నారు. సమావేశాల్లో స్థానిక సమస్యల కంటే బతుకమ్మలాడేందుకు డీజేలు ఇవ్వమని మహిళలు అడుగుతున్నారు. యువకులు క్రికెట్ కిట్లు, వాలీబాల్ కిట్లను డిమాండ్ చేస్తున్నారు.

కారు అమ్మకం పేరుతో నగదు స్వాహా

పాల్వంచ: సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్‌లో కారు అమ్మకం పేరుతో నగదు స్వాహాచేశారు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని వెంగళరావుకాలనీకి చెందిన సయ్యద్ రషీద్ ఈనెల 5వ తేదీన సెకండ్ హ్యాండ్ కారు కొనుగోలు చేసేందుకు ఆన్‌లైన్‌లో కారును ఎంపిక చేసుకున్నాడు. వెంటనే లింక్ రావడంతో ఓపెన్ చేయగా రూ.3,500 చెల్లించాలని వచ్చింది. అనంతరం పలుమార్లు వచ్చిన లింక్‌లకు రూ.1.75 లక్షల వరకు చెల్లించాడు. తర్వాత తాను మోసానికి గురైనట్లు గుర్తించి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారా స్వాధీనం

దుమ్ముగూడెం: మండలంలోని దబ్బనూతుల గ్రామశివారులో హెడ్‌కానిస్టేబుల్ కృష్ణయ్య వాహన తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తి తరలిస్తున్న నాటుసారాను మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ కేశవరావు కథనం ప్రకారం.. ఓ వ్యక్తి మోటార్ సైకిల్‌పై వస్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించగా అతడిని పట్టుకున్న పోలీసులు తనిఖీ చేయగా 10 లీటర్ల నాటుసారా లభించింది. అతడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించగా తాటివారిగూడెం గ్రామానికి చెందిన తుర్రం చిన్నబ్బిగా తేలింది. కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సులో దోపిడీ కలకలం

ఇల్లెందురూరల్: ఆర్టీసీ బస్సులో నగదు దోపిడీ జరిగినట్లుగా ఓ మహిళ చెప్పడం కలకలం రేపింది. పోలీసులు కూడా మహిళ ఆరోపణతో అప్రమత్తమై రెండు గంటలపాటు విచారణ చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. గుండాల మండలం గనాపురం గ్రామానికి చెందిన తులసి తన కుమార్తెను కలుసుకునేందుకు మండలంలోని కొమ్ముగూడెం ఆశ్రమ పాఠశాలకు ఆర్టీసీ బస్సులో చేరుకుంది. బస్సు వెళ్లిపోయిన తరువాత అక్కడే నిల్చున్న తులసి బస్సులో నగదు చోరీ జరిగిందని స్థానికులకు వివరించింది. మార్గమధ్యలో తనిఖీ పేరుతో బస్సు ఎక్కిన వ్యక్తులు తన వద్ద రూ.20 వేలు, మరికొంత మంది వద్ద కూడా నగదు మొత్తంగా రూ.లక్ష వరకు తీసుకెళ్లారని చెప్పింది. విషయం కొద్ది సేపట్లోనే సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సీఐ కరుణాకర్ నేరుగా ఆశ్రమ పాఠశాల వద్దకు చేరుకొని మహిళను ప్రశ్నించాడు. మంగళవారం ఇల్లెందు – గుండాల సర్వీసులో పనిచేసిన ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్‌లను ఏం జరిగిందని అడిగి తెలుసుకున్నారు. తమ బస్సులను ఎవరూ.. ఎక్కడ.. ఆపి తనిఖీ చేయలేదని వివరించారు. దీంతో తనిఖీ పేరుతో చోరీ జరగలేదని నిర్ధారించుకున్న సీఐ అసత్య ప్రచారంగా ప్రకటించారు.

ఇసుక వాహనాల పట్టివేత

చర్ల: మండలంలోని వీరాపురం సమీపాన గోదావరిలో ఇసుక క్వారీ నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తోడుతున్నజేసీబీతో పాటు తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను మంగళవారం రాత్రి రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్థానికుల ద్వారా అందిన సమాచారంతో తహసీల్దార్ ఆర్.అనంతరామకృష్ణ సిబ్బందితో వీరాపురం వెళ్లి వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా, ఈ వాహనాలు అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధికి చెందినవని సమాచారం.

లారీలు సీజ్

ములకలపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలను అటవీశాఖ అధికారులు సీజ్ చేశారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో ఎఫ్ఎస్ఓ హరిప్రశాంత్, మాదారం ఎఫ్‌బీఓ కృష్ణ మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రెండు లారీలను సీజ్ చేసినట్లు పాల్వంచ రేంజ్‌ఆఫీసర్ అనిల్‌కుమార్ తెలిపారు.

'పేట'లో వీడిన ఉత్కంఠ

- ప్రధాన అభ్యర్థులుగా మెచ్చా, జారే
- బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోనున్న తాటి
- కాంగ్రెస్ నుంచి రెబల్స్ లేనట్టే..

అశ్వారావుపేట: అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థుల్లో ప్రధాన పోటీదారులెవరనే ఉత్కంఠకు తెరపడింది. కాంగ్రెస్ అభ్యర్థిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడు జారే ఆదినారాయణ పేరు ప్రకటించడంతో ప్రత్యర్థులెవరో ఖరారయ్యారు. కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మంగళవారం మంత్రి హరీశ్‌రావును కలవడం, కాంగ్రెస్‌కు రాజీనామా చేయడంతో రెబల్ నామినేషన్ దాఖలవుతుందనే ఊహాగానాలు నిలిచిపోయాయి. టికెట్ ఆశించిన మరో నేత సున్నం నాగమణిని ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని పలువురు అభిమానులు కోరుతున్నా ఆమె స్పందించకపోవడంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్యే ప్రధాన పోరు సాగుతుందని తేలిపోయింది. కాగా గత ఎన్నికల్లో వీరిద్దరూ వేర్వేరు పార్టీల నుంచి పోటీ చేశారు. 2014 ఎన్నికల్లో జారే ఆదినారాయణ టీఆర్ఎస్ నుంచి పోటీ చేయగా మెచ్చా నాగేశ్వరరావు టీడీపీ నుంచి పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేసిన తాటి వెంకటేశ్వర్లు 49,546 ఓట్లతో గెలుపొందారు. టీడీపీ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు 48,616 ఓట్లతో రెండో స్థానంలో నిలవగా టీఆర్ఎస్ అభ్యర్థి ఆదినారాయణకు 13,247 ఓట్లు మాత్రమే లభించాయి. 2018 ఎన్నికల్లో మెచ్చా నాగేశ్వరరావు మహాకూటమిలో భాగంగా కాంగ్రెస్ బలపరిచిన టీడీపీ అభ్యర్థిగా పోటీ చేయగా జారే ఆదినారాయణకు టీఆర్ఎస్ టికెట్ దక్కకపోవడంతో బరిలో లేరు. ఈ ఎన్నికల్లో మెచ్చా నాగేశ్వరరావు సమీప ప్రత్యర్థి తాటి వెంకటేశ్వర్లుపై గెలుపొందారు. మెచ్చా నాగేశ్వరరావుకు 61,124 ఓట్లు, తాటి వెంకటేశ్వర్లుకు 48,007 ఓట్లు లభించాయి.



మెచ్చా నాగేశ్వరరావు



జారే ఆదినారాయణ

వసతిగృహం సమస్యలు పరిష్కరించండి..

మెనూ పాటించడం లేదని హాస్టల్ ఎదుట విద్యార్థుల ధర్నా

మణుగూరుటౌన్: సమితిసింగారంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో వార్డెన్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని, మెనూ పాటించడం లేదని, సమయానికి భోజనం పెట్టడం లేదని మంగళవారం విద్యార్థులు వసతిగృహం ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. కొంతకాలంగా సరైన భోజనం లేక తాము పస్తులుండాల్సిన పరిస్థితి ఉందని, మెనూ పాటించడం లేదని, వార్డెన్ హాస్టల్‌కు రాకపోవడంతో ఫోన్ చేసినా పట్టించుకోవడం లేదని, రుచి లేని భోజనం పెడుతుండటంతో తాము తినలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వసతిగృహంలో విష పురుగులు సంచరిస్తున్నాయని చెప్పినా కాపలాదారుడిని కూడా పెట్టడం లేదని, వార్డెన్ కొత్తగూడెం పరిసర ప్రాంతాల నుంచి వస్తూ ఉంటారని, ఇప్పటికీ హాస్టల్‌కి రాక చాలా రోజులైందని వాపోయారు.



హాస్టల్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

16 కిలోల గంజాయి స్వాధీనం

భద్రాచలంటౌన్: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని మంగళవారం పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ విజయలక్ష్మి ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని ఆపి తనిఖీ చేయగా 16 కిలోల గంజాయి లభించింది. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా హైదరాబాద్‌కు చెందిన మామిడి విజయ్‌కుమార్, తుమ్మకొమ్మ రాజేశ్, ప్రవీణ్.. ఒడిశా సరిహద్దులోని సీలేరు నుంచి గంజాయి కొనుగోలు చేసి నగరంలో విక్రయిస్తున్నట్లు తేలింది. నిందితుల వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లతో పాటు ద్విచక్రవాహనంను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.4.35 లక్షలు ఉంటుందని, నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నాగరాజురెడ్డి తెలిపారు.

మావోయిస్టు యాక్షన్ టీం సభ్యుడు లొంగుబాటు

భద్రాచలంటౌన్: భద్రాచలం పోలీసుల ఎదుట మావోయిస్టు పార్టీ యాక్షన్ టీం సభ్యుడు లొంగిపోయాడు. భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ మంగళవారం వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, సుక్మా జిల్లా, చింతగుప్ప పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రంపాడు గ్రామానికి చెందిన వెట్టి భీమ 2012లో మావోయిస్టు పార్టీలో చేరి ప్రస్తుతం సౌత్ బస్తర్ డీసీవీలో యాక్షన్ టీం సభ్యుడి కొనసాగుతున్నాడు. ప్రస్తుత సిద్ధాంతాలు నచ్చక భీమ పోలీసుల ఎదుట లొంగిపోయిన్నట్లు ఏఎస్పీ తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన అనేక హింసాత్మక ఘటనల్లో భీమ పాల్గొన్నట్లు వివరించారు. సమావేశంలో పట్టణ సీఐ నాగరాజురెడ్డి, ఎస్ఐ మధుప్రసాద్, సీఆర్‌పీఎఫ్ అధికారులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ పరితోష్ పంకజ్

బైక్‌తో ఢీకొట్టిన వ్యక్తిపై కేసు

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదానికి కారకుడైన రుద్రంపూర్‌కు చెందిన ఎలుపుల పరిపూర్ణచారిపై ఎస్ఐ కేశవరావు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. సోమవారం రాత్రి ములకపాడు గామానికి చెందిన పూనెం అదయ్య పంట పొలానికి నీరు పెట్టడానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ములకపాడు సెంటర్‌లో ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చర్ల వైపు నుంచి భద్రాచలం వైపు వస్తున్న ద్విచక్రవాహనదారుడు పరిపూర్ణాచారి నిర్లక్ష్యంగా నడిపి ప్రమాదానికి కారణమయ్యాడని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇరు వర్గాలపై కేసు

అశ్వారావుపేటరూరల్: ఇరు వర్గాలపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని కోనేరుబజారు, జల్లిపల్లి వీధికి చెందిన టి.బ్రహ్మయ్య భార్య పోచమ్మకు వరుసకు మేనల్లుడైన కనకయ్య ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడాడు. వేధింపులకు గురిచేశాడు. దీంతో బ్రహ్మయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే విషయంలో తనపై బ్రహ్మయ్య దాడి చేశాడని కనకయ్య ఫిర్యాదు చేయగా, ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి మృతిపై ఆందోళన

అశ్వాపురం: మండలంలోని సీతరాంపురంకాలనీకి చెందిన సప్కా ఏసు (40) అనుమానాస్పదంగా మృతి చెందాడు. కాగా, అతడి మృతికి స్థానికంగా ఓ బెల్ట్ షాపు నిర్వాహకుడే కారణమని అతని ఇంటి ఎదుట మంగళవారం మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహంతో ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో అతడి ఇల్లును స్వల్పంగా ధ్వంసం చేశారు. సీఐ రవీందర్, ఎస్ఐలు సురేశ్, తిరుపతిరావు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. అనుమానాస్పదంగా మృతి చెందాడని మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రవీందర్ తెలిపారు.



ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు

సాక్షి బిజినెస్
బుధవారం
8-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
16	5
64,942	19,407

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	13,615	△	93
డోజోన్స్	34,141	△	45
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,410	▽	8
డాక్స్	15,153	△	17
షాంఘై	3,057	▽	1
నికాయ్	32,708	▽	448

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	60,579	▽	474
బంగారం (99.5 స్వచ్ఛత)	60,336	▽	472
వెండి (కిలో)	72,705	▽	1,332

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.48	84.15
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	99.99	103.36
€	యూరో	ఎస్‌బీఐ	87.01	90.10
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.58	56.26
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.53	54.84
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.20	62.14
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.19	22.82
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.65	23.49
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.29	12.38

స్వల్పంగా పెరిగిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రుణ రేటు



ముంబై: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కొన్ని కాలపరిమితుల రుణాలపై వడ్డీ రేటును స్వల్పంగా 0.05 శాతం (ఐదు బేసిస్ పాయింట్లు) పెంచింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గడచిన ఐదు ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షల్లోనూ రెపో రేటు (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు– ప్రస్తుతం 6.5%) పెంపుపై ఎటువంటి నిర్ణయం తీసుకోనప్పటికీ, హెచ్‌డీఎఫ్‌సీ తాజా రేటు పెంపు నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం, ఓవర్‌నైట్ ఎంసీఎల్‌ఆర్ 8.65 శాతానికి పెరిగింది. మూడేళ్ల ఎంసీఎల్‌ఆర్ 9.30 శాతానికి ఎగసింది. కాగా, సాధారణంగా అధిక రుణాలకు ప్రాతిపదిక అయిన ఏడాది రుణ రేటు మాత్రం 9.20 శాతం వద్ద స్థిరంగా ఉంది.

హైదరాబాద్‌లో రిలయన్స్ స్వదేశ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రిటైల్ రంగ దిగ్గజం రిలయన్స్ రిటైల్ 'స్వదేశ్' తొలి ఔట్‌లెట్‌ను హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసింది. రిలయన్స్ ఫౌండేషన్ ఫౌండర్, చైర్‌పర్సన్ నీతా అంబానీ చేతుల మీదుగా నేడు (బుధవారం) ఈ స్టోర్ ప్రారంభం కానుంది. సుమారు 30,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇది కొలువుదీరింది. చేనేత వస్త్రాలు, హస్తకళలు, ఫర్నిచర్, బొమ్మలు, ఆభరణాలు, గృహాలంకరణ వస్తువులు, పెయింటింగ్స్, యాక్సెసరీస్‌తోపాటు వ్యవసాయ ఉత్పత్తులను ఇక్కడ విక్రయిస్తారు. దేశవ్యాప్తంగా చేతి వృత్తుల కళాకారులకు చెందిన గుర్తింపు ఉన్న సంఘాల నుంచి నేరుగా వీటిని సేకరిస్తారు. రూ.6 లక్షలకుపైగా ధర పలికే వస్తువులనూ విక్రయిస్తారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

08-11-2023	
విశాఖ	530-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	72.00
07-11-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	515-00
వరంగల్	517-00
రిటైల్ ధర	5.75

వుయ్‌వర్క్ దివాలా!

- వ్యాపార పునర్‌వ్యవస్థీకరణపై దృష్టి
- లీజుల క్రమబద్ధీకరణకు కసరత్తు



న్యూయార్క్: ఆఫీస్ స్పేస్ విభాగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన అంతర్జాతీయ దిగ్గజం వుయ్‌వర్క్ దివాలా ప్రకటించింది. వ్యాపారాన్ని యథాప్రకారం కొనసాగిస్తూ, కార్యకలాపాలను పునర్‌వ్యవస్థీకరించుకునే దిశగా అమెరికాలో చాప్టర్ 11 దివాలా పిటిషన్ దాఖలు చేసింది. వ్యాపార పునర్నిర్మాణ ప్రక్రియ ప్రారంభించినట్లు కంపెనీ తెలిపింది. కమర్షియల్ ఆఫీస్ లీజుల పోర్ట్‌ఫోలియోను మరింత క్రమబద్ధీకరించుకోనున్నట్లు పేర్కొంది. రుణభారాన్ని గణనీయంగా తగ్గించుకునే దిశగా పునర్‌వ్యవస్థీకరణ విషయంలో తోడ్పాటు అందించేలా సంబంధిత వాటాదారులతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. అమెరికా, కెనడా వెలుపలి దేశాల్లోని తమ కార్యకలాపాలపై ఈ పరిణామ ప్రభావం ఉండబోదని వుయ్‌వర్క్ వివరించింది. సమస్యలను పరిష్కరించుకుని, వ్యాపారాన్ని మెరుగుపర్చుకుంటూ ముందుకు సాగడంపై దృష్టి పెడుతున్నట్లు సంస్థ సీఈవో డేవిడ్ టోలీ ఒక ప్రకటనలో తెలిపారు. కంపెనీ ఈ ఏడాది ప్రథమార్ధంలో 696 మిలియన్ డాలర్ల నష్టం నమోదు చేసింది. జూన్ 30 నాటికి వుయ్‌వర్క్‌కు 39 దేశాల్లో 777 చోట్ల కార్యకలాపాలు ఉన్నాయి.

అప్పట్లో 50 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్ ..

గతంలో దాదాపు 50 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్‌తో వెలుగొందిన వుయ్‌వర్క్ దివాలా తీయడానికి అనేక కారణాలు ఉన్నాయి. అతి దూకుడుగా విస్తరించడం, వ్యవస్థాపకుడు ఆడమ్ న్యూమాన్ పోకడలు మొదలైనవి ఇందుకు దారితీశాయి. వాస్తవానికి కొన్నాళ్ల క్రితం నుంచే దివాలా సంకేతాలు కనిపించడం మొదలైంది. 2019లో తొలి పబ్లిక్ ఇష్యూ ప్రయత్నం ఘోరంగా విఫలం కాగా ఆ తర్వాత 2021లో ఐపీవోకి వచ్చినా వేల్యుయేషన్ అనేక రెట్లు తగ్గి 9 బిలియన్ డాలర్లకు పడిపోయింది. అంతకన్నా ముందే కంపెనీ, వ్యవస్థాపకుడి పనితీరుపై ఇన్వెస్టర్లలో తీవ్ర అసంతృప్తి నెలకొనడంతో.. న్యూమాన్ ఉద్వాసనకు గురయ్యారు. సంస్థలో మెజారిటీ వాటాలు తీసుకున్న జపాన్ దిగ్గజం సాఫ్ట్‌బ్యాంక్.. కంపెనీని నిలబెట్టేందుకు ప్రయత్నించింది. నిర్వహణ వ్యయాలను తగ్గించుకోవడం, ఆదాయాన్ని పెంచుకోవడం వంటి ప్రయత్నాలు జరిగినా పెద్దగా ఫలితం లేకపోయింది. వ్యాపారాన్ని కొనసాగించే సామర్థ్యాలు అంతంతమాత్రంగానే ఉన్నాయంటూ వుయ్‌వర్క్ ఆగస్టులోనే వెల్లడించింది. ఆ తర్వాత లీజులన్నింటినీ పునఃసమీక్షించుకునే యోచనలో ఉన్నట్లు సెప్టెంబర్‌లో ప్రకటించింది. నష్టాల్లో ఉన్న లొకేషన్ల నుంచి వైదొలగనున్నట్లు తెలిపింది.

భారత్‌లో ప్రభావం ఉండదు..

వుయ్‌వర్క్ గ్లోబల్ దివాలా ప్రభావం భారత విభాగంపై ఉండదని వుయ్‌వర్క్ ఇండియా సీఈవో కరణ్ విర్వాణి స్పష్టం చేశారు. దివాలా ప్రక్రియలో భారత వ్యాపారం భాగంగా లేదని తెలిపారు. వుయ్‌వర్క్ ఇండియాలో రియల్ ఎస్టేట్ సంస్థ ఎంబసీ గ్రూప్‌నకు 73 శాతం, వుయ్‌వర్క్ గ్లోబల్‌కు 27 శాతం వాటాలు ఉన్నాయి. భారత్‌లో ఏడు నగరాల్లో వుయ్‌వర్క్ ఇండియాకు 50 కేంద్రాలు ఉన్నాయి. 2021 జూన్‌లో వుయ్‌వర్క్ ఇండియాలో వుయ్‌వర్క్ గ్లోబల్ 100 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసింది.

బ్యాంకింగ్‌కు ప్రత్యామ్నాయంగా ఫిన్‌టెక్


'ఆర్‌బీఐ' నివేదిక



ముంబై: సమీప భవిష్యత్తులో సాంప్రదాయ బ్యాంకింగ్‌కు ఫిన్‌టెక్ రంగం ప్రత్యామ్నాయంగా ఎదిగే అవకాశాలు ఉన్నాయని సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ ఫైనాన్షియల్ రీసెర్చ్ అండ్ లెర్నింగ్ (కెఫ్రాల్) ఒక నివేదికలో పేర్కొంది. డిజిటలీకరణ వృద్ధికి, ఆర్థిక స్థిరత్వ సాధనకు ఎప్పటికప్పుడు తగు విధంగా మలుచుకోగలిగే నియంత్రణ విధానాలు అవసరమని తెలిపింది. ఇండియా ఫైనాన్స్ రిపోర్ట్ 2023 పేరిట కెఫ్రాల్ రూపొందించిన తొలి ప్రచురణను రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ మంగళవారం విడుదల చేశారు. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగంలో పరిశోధనలను ప్రోత్సహించేందుకు 2011లో కెఫ్రాల్‌ను లాభాపేక్ష రహిత సంస్థగా ఆర్‌బీఐ ఏర్పాటు చేసింది. దేశీయంగా బ్యాంకిగేతర ఆర్థిక రంగ స్థితిగతులను అర్థం చేసుకోవడంలో నియంత్రణ సంస్థలు, విధాన నిర్ణేతలు సహా సంబంధిత వర్గాలకు సహాయకరంగా ఉండే అంశాలను తాజా నివేదికలో పొందుపర్చారు. దేశీ సాంకేతిక తోడ్పాటుతో భారత్‌లో డిజిటలీకరణ వేగవంతమవుతోందని, డిజిటల్ రుణాలు.. ముఖ్యంగా ఫిన్‌టెక్ రుణాలు గణనీయంగా పెరిగాయని నివేదిక పేర్కొంది.

పవర్ గ్రిడ్ లాభం అప్

క్యూ2లో రూ. 3,781 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం పవర్ గ్రిడ్ కార్ప్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 4 శాతం వృద్ధితో రూ. 3,781 కోట్లను అధిగమించింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 3,650 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 11,349 కోట్ల నుంచి రూ. 11,530 కోట్లకు ఎగసింది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 4 చొప్పున మధ్యంతర డివిడెండును ప్రకటించింది. డిసెంబర్ 6కల్లా చెల్లించనుంది.

ఫలితాల నేపథ్యంలో పవర్ గ్రిడ్ షేరు ఎన్‌ఎస్‌ఈలో దాదాపు యథాతథంగా రూ. 208 వద్ద ముగిసింది.

జోయాలుక్కాస్ దీపావళి క్యాష్‌బ్యాక్ ఆఫర్లు



హైదరాబాద్: దీపావళి సందర్భంగా జోయాలుక్కాస్ క్యాష్‌బ్యాక్ ఆఫర్లు ప్రకటించింది. రూ.50,000 విలువైన డైమండ్, అన్ కట్ డైమండ్స్–ప్రెషస్ జ్యువెలరీ కొనుగోలుపై రూ.2 వేల విలువైన క్యాష్‌బ్యాక్ గిఫ్ట్ వోచర్ పొందవచ్చు. అలాగే రూ.50 వేల విలువైన బంగారం ఆభరణాల కొనుగోలుపై రూ.1000 విలువైన క్యాష్‌బ్యాక్ గిఫ్ట్ వోచర్, రూ.10వేల విలువైన వెండి ఆభరణాలపై రూ.500 విలువైన గిఫ్ట్ వోచర్లు అందిస్తుంది. అడ్వాన్స్ బుకింగ్ స్కీమ్‌తో షాపింగ్ చేసే కస్టమర్లు ప్రోత్సాహక బహుమతి పొందొచ్చు. ఇప్పటికే ప్రారంభమైన ఆఫర్లు నవంబర్ 12 వరకు అమలులో ఉంటాయి. క్యాష్‌బ్యాక్ రూపంలో కస్టమర్లకు మేమిచ్చే బహుమతులు వారి దీపావళిని మరింత శోభాయమానం చేస్తాయని సంస్థ ఎండీ జాయ్ అలుక్కాస్ తెలిపారు.

3 రోజుల లాభాలకు బ్రేక్

- స్వల్ప నష్టాల ముగింపు
- విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాల ప్రభావం



ముంబై: దేశీయ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు కొనసాగడంతో స్టాక్ సూచీల 3 రోజుల వరుస లాభాలకు మంగళవారం బ్రేక్ పడింది. ఆసియా, యూరప్ మార్కెట్లలో నెలకొన్న బలహీన సంకేతాలు సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. ఛత్తీస్‌గఢ్, మిజోరం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ట్రేడర్లు ఆచితూచి వ్యవహరించారు. ట్రేడింగ్‌లో 383 పాయింట్ల రేంజ్‌లో కదలాడిన సెన్సెక్స్ చివరికి 16 పాయింట్ల స్వల్ప నష్టంతో 64,942 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 94 పాయింట్ల పరిధిలో కదలాడింది. ఆఖరికి ఐదు పాయింట్ల నష్టంతో 19,407 వద్ద నిలిచింది. చైనా అక్టోబర్ ఎగుమతులు భారీగా క్షీణించినట్లు డేటా వెల్లడికావడంతో ఆసియాలో ఒక్క తైవాన్ తప్ప మిగిలిన అన్ని దేశాల స్టాక్ సూచీలు 2% నష్టపోయాయి. కార్పొరేట్ క్యూ3 ఆర్థిక ఫలితాల ప్రకటన, ఇంధన షేర్ల పతనంతో యూరప్ మార్కెట్లు ఒకశాతం మేర పతనమయ్యాయి.

- హోనాసా కన్జూమర్ లిస్టింగ్ పర్వాలేదనిపించింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.324) వద్దే లిస్టయ్యింది. చివరికి 4% లాభంతో రూ.337 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.10,848 కోట్లుగా నమోదైంది.
- ఈఎస్‌ఏఎఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఐపీఓ చివరిరోజు నాటికి 73.15 రెట్లు సబ్‌స్క్రయిబ్ అయ్యింది. 5.77 కోట్ల ఈక్విటీలను జారీ చేయగా 422 కోట్ల ఈక్విటీలకు బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీ కోటా 173.52 రెట్లు, సంస్థాగతేర ఇన్వెస్టర్ల కోటా 84.37 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల కోటా 16.97 రెట్లు సబ్‌స్క్రయిబ్ అయ్యాయి.

మ్యాక్సివిజన్ బ్రాండ్ అంబాసిడర్‌గా ధోని



చెన్నై: కంటి సంరక్షణ సేవల సంస్థ మ్యాక్సివిజన్‌సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్స్ తాజాగా క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనిని తమ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. అన్ని వర్గాలకు చిరపరిచితమైన ధోని వంటి దిగ్గజంతో జత కట్టడమనేది.. క్రమం తప్పకుండా కంటి చెకప్‌లు చేయించుకోవాల్సిన ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన పెంచడానికి దోహదపడగలదని సంస్థ సీఎండీ జీఎస్‌కే వేలు తెలిపారు. చౌకగా కంటి సంరక్షణ సేవలను అందరికీ అందుబాటులోకి తేవాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. తమ నెట్‌వర్క్‌లోని 40కిపైగా ఆస్పత్రుల్లో నిత్యం వేల కొద్దీ పేషెంట్లకు సర్వీసులు అందిస్తున్నామని సంస్థ సీఈవో సుధీర్ వీఎస్ తెలిపారు.

జాబ్ పాయింట్

ఎన్‌ఐఆర్‌డీపీఆర్, హైదరాబాద్‌లో యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్.. ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04
» **అర్హత:** పీజీ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ఎంబీఏ(హెచ్‌ఆర్) చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుంది. వయసు: 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.32,000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.11.2023
» **వెబ్‌సైట్:** www.nirdpr.in

పీజీసీఐఎల్, న్యూఢిల్లీలో 10 ఆఫీసర్ ట్రైనీ(లా) పోస్టులు

న్యూఢిల్లీలోని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(పీజీసీఐఎల్).. క్లాట్ 2024 స్కోరు ద్వారా ఆఫీసర్ ట్రైనీ(లా) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 10
» **అర్హత:** 60 శాతం మార్కులతో ఎల్‌ఎల్‌బీ లేదా ఇంటిగ్రేటెడ్ లా/ఎల్‌ఎల్‌బీ కోర్సు ఉత్తీర్ణతతోపాటు క్లాట్–2024 స్కోరు సాధించి ఉండాలి.
» **వయసు:** 29.11.2023 నాటికి 28 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** క్లాట్–2024 స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 09.11.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 29.11.2023
» **వెబ్‌సైట్:** www.powergrid.in

అల్లూరి సీతారామరాజు జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖలో 13 ఉద్యోగాలు

అల్లూరి సీతారామరాజు జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 13
» **పోస్టుల వివరాలు:** జిల్లా కోఆర్డినేటర్–1, జిల్లా ప్రాజెక్ట్ అసిస్టెంట్–1, బ్లాక్ కోఆర్డినేటర్–11.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి
» **వేతనం:** నెలకు జిల్లా కోఆర్డినేటర్‌కు రూ.30,000. జిల్లా ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ. 18,000. బ్లాక్ కోఆర్డినేటర్‌కు రూ.20,000
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, బాలసదన్ పక్కన, పాడేరు, అల్లూరి సీతారామరాజు జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 10.11.2023.
» **వెబ్‌సైట్:** allurisitharamaraju.ap.gov.in

బెల్ బెంగళూరులో 16 ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, బెంగళూరు కాంప్లెక్స్.. ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 16
» **అర్హత:** బీఈ, బీటెక్(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ /ఎలక్ట్రానిక్స్ /టెలికమ్యూనికేషన్/కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ /ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్).
» **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి రూ.55,000 వరకు ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.11.2023
» **వెబ్‌సైట్:** www.belindia.in

నంద్యాల జిల్లా మహిళా,శిశు సంక్షేమ, సాధికారత కార్యాలయంలో 23 పోస్టులు

నంద్యాల జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 23
» **పోస్టుల వివరాలు:** జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్–01, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఇన్‌స్టిట్యూషనల్ కేర్–01, ప్రొటెక్షన్ ఆఫీసర్ నాన్ ఇన్‌స్టిట్యూషనల్ కేర్–01, లీగల్ కమ్ ప్రొటెక్షన్ ఆఫీసర్–01, కౌన్సిలర్–01, సోషల్ వర్కర్–02, అకౌంటెంట్–01, డేటా అనలిస్ట్–01, అసిస్టెంట్ కమ్ డేటాఎంట్రీ ఆపరేటర్–01, అవుట్‌రీచ్ వర్కర్స్–02, మేనేజర్/కోఆర్డినేటర్(మహిళలు)–01, సోషల్ వర్కర్ కమ్–ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేటర్(మహిళలు)–01, నర్సు(మహిళలు)–01, డాక్టర్(పార్ట్‌టైమ్)–01, ఆయా(మహిళలు)–06, చౌకీదార్(మహిళలు)–01.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా, ఇంటర్,డిగ్రీ,పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, బీఎస్‌ఎన్‌ఎల్ క్వార్టర్స్, బొమ్మలసత్రం, నంద్యాల చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 10.11.2023.
» **వెబ్‌సైట్:** nandyal.ap.gov.in

ఐఐఎంల్లో.. సమ్మర్ ప్లేస్‌మెంట్స్ హవా!

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్.. సంక్షిప్తంగా ఐఐఎం! మేనేజ్‌మెంట్ విద్యలో అంతర్జాతీయ ప్రమాణాలు పాటిస్తూ.. విద్యార్థులకు నిత్యనూతన నైపుణ్యాలు అందించడంలో.. ముందుండే ఇన్‌స్టిట్యూట్స్!! వీటిలో కోర్సులు పూర్తి చేసుకుంటే.. కార్పొరేట్ సంస్థల రెడ్ కార్పెట్ స్వాగతం ఖాయం అనే అభిప్రాయం! ఐఐఎంల్లో ఇటీవల సమ్మర్ ప్లేస్‌మెంట్ ప్రక్రియ మొదలైంది! పలు సంస్థలు భారీ స్టయిఫండ్‌తో ఎస్‌పీఓలు ఖరారు చేస్తున్నాయి! ఈ నేపథ్యంలో.. ఐఐఎంల్లో సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ తాజా ట్రెండ్స్, అవకాశాలు కల్పిస్తున్న రంగాలు, స్టయిఫెండ్స్ తదితర వివరాలు..

» ఐఐఎంలలో మొదలైన ఎస్‌పీఓ ప్రక్రియ
» పలు ఇన్‌స్టిట్యూట్స్‌లో వందశాతం ఆఫర్లు
» సగటున రూ.2 లక్షల స్టయిఫండ్

కార్పొరేట్ సంస్థలకు ఐఐఎం విద్యార్థులు హాట్ కేక్స్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆయా కంపెనీలకు అవసరమైన నిర్వహణ నైపుణ్యాలు ఐఐఎంల విద్యార్థుల్లో ఉంటాయని భావించడమే ఇందుకు నిదర్శనం. తాజాగా ఐఐఎంలలో కొనసాగుతున్న ఎస్‌పీఓ ప్రక్రియ, అందిస్తున్న ఆఫర్లే ఇందుకు నిదర్శనం అంటున్నారు నిపుణులు.

సమ్మర్ ప్లేస్‌మెంట్స్‌గా

ఐఐఎం పీజీ ప్రోగ్రామ్‌ల్లో చేరిన విద్యార్థులు మొదటి సంవత్సరం పూర్తయ్యాక లభించే సెలవు రోజుల్లో సమ్మర్ ప్లేస్‌మెంట్స్ చేస్తారు. అంతకు ముందు కంపెనీలు విద్యార్థులను ఇంటర్న్ ట్రైనీగా ఎంపిక చేసేందుకు ప్రత్యేక ప్రక్రియ నిర్వహిస్తారు. ఈ సమ్మర్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో నెగ్గిన విద్యార్థులకు సంస్థలు రెండు వారాల వ్యవధిలో ఇంటర్న్ ట్రైనీగా విధులు నిర్వహించడానికి అవకాశం కల్పిస్తాయి. ఇలా ఇంటర్న్ ట్రైనీగా ఎంపికైన వారికి స్టయిపండ్ పేరుతో ఆర్థిక ప్రోత్సాహకాలు కూడా అందిస్తాయి. ఇది రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఉంటుంది.

అందరికీ ఆఫర్స్

- 2023–25 బ్యాచ్ విద్యార్థులకు సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ వెల్లువెత్తున్నాయి.
- ఐఐఎం–లక్నోలో మొత్తం 576 మంది విద్యార్థులకు సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ లభించాయి. వీరికి సగటు స్టయిఫండ్ నెలకు రూ 1.31 లక్షలుగా, గరిష్ట స్టయిఫండ్ రూ.3.5 లక్షలుగా నిలవడం గమనార్హం.
- ఐఐఎం–కోల్‌కతలో.. 466 మంది విద్యార్థులకుగాను అందరికీ సమ్మర్ ప్లేస్‌మెంట్స్ లభించడం విశేషం. వీరికి సగటు స్టయిఫండ్ రూ.1.65 లక్షలుగా, గరిష్ట స్టయిఫండ్ రూ.3.75 లక్షలుగా ఉంది.
- ఐఐఎం–నాగపూర్‌లోనూ నూటికి నూరు శాతం విద్యార్థులకు సమ్మర్ ప్లేస్‌మెంట్స్ లభించాయి. సగటు స్టయిఫండ్ రూ.79 వేలుగా ఉంది.

కొనసాగుతున్న ప్రక్రియ

దేశంలోని ఇతర ఐఐఎంలలోనూ ప్రస్తుతం సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ ప్రక్రియ కొనసాగుతోంది. ఐఐఎం–అహ్మదాబాద్, బెంగళూరు తదితర క్యాంపస్‌లలో ఈ నెల రెండో వారంలోపు ఈ ప్రక్రియ పూర్తవనుంది. ఇప్పటి వరకు లభించిన సమాచారం ప్రకారం–ఇతర ఐఐఎంలలోనూ సమ్మర్ ప్లేస్‌మెంట్స్ దాదాపు వంద శాతం లభించే సంకేతాలున్నాయని ఆయా క్యాంపస్ ప్లేస్‌మెంట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

బీఎఫ్ఎస్ఐ, కన్సల్టింగ్, ఫైనాన్స్

- ఐఐఎంలు, ఇతర బి–స్కూల్స్‌లో సమ్మర్ ప్లేస్‌మెంట్స్‌లో ఈ ఏడాది కన్సల్టింగ్, ఫైనాన్స్ రంగాల హవా కనిపించింది. ఇప్పటి వరకు అన్ని బి–స్కూల్స్‌లో దాదాపు 40 శాతం మేర సమ్మర్ ప్లేస్‌మెంట్స్.. కన్సల్టింగ్, ఫైనాన్స్ రంగాలకు చెందిన సంస్థల నుంచే ఉన్నాయి. బీసీజీ, బెయిన్ అండ్ కో, యాక్సెంచర్ స్ట్రాటజీ, పీడబ్ల్యూసీ, డెలాయిట్, కేపీఎంజీ, సినర్జీ కన్సల్టింగ్ కంపెనీలు టాప్ రిక్రూటర్స్‌గా నిలిచాయి.
- కన్సల్టింగ్, ఫైనాన్స్ రంగాల తర్వాత ఐటీ, ఈ–కామర్స్ సంస్థలు టాప్ రిక్రూటర్స్‌గా ఉన్నాయి. ఈ రంగాల్లో డేటా మేనేజ్‌మెంట్, ఫైనాన్స్, మార్కెటింగ్ విభాగాల్లో ఇంటర్న్‌షిప్ చేసే విధంగా ఆఫర్లు లభించాయి. అదే విధంగా గూగుల్, ఫేస్‌బుక్ సంస్థలు కూడా ఎస్‌పీఓ ఆఫర్లు కల్పించాయి.

సేల్స్, అండ్ మార్కెటింగ్‌లోనూ

సేల్స్ అండ్ మార్కెటింగ్ ప్రొఫైల్స్‌లోనూ ఈ ఏడాది సమ్మర్ ప్లేస్‌మెంట్స్ జోరు కొనసాగింది. ముఖ్యంగా ప్రొడక్ట్ రీసెర్చ్, మార్కెట్ అనాలిసిస్ విభాగాల్లో విధులు నిర్వర్తించే విధంగా ఈ ఆఫర్స్ లభించాయి. అదే సమయంలో జనరల్ మేనేజ్‌మెంట్ విభాగంలోనూ సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ ఖరారయ్యాయి. పలు సంస్థలు ఈ విభాగాల్లో విద్యార్థులను నియమించుకునే క్రమంలో విశ్లేషణాత్మక దృక్పథం, మార్కెట్ పరిస్థితులపై వారికున్న అవగాహనను క్షుణ్నంగా పరిశీలించి ఆఫర్స్ ఇచ్చినట్లు ఐఐఎంల వర్గాలు పేర్కొన్నాయి.



ఎంబీఏ స్పెషల్

ఈ ప్రొఫైల్స్‌లో అధికంగా

సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్‌లో ఎక్కువగా డేటా మేనేజ్‌మెంట్; ఫైనాన్స్ మేనేజ్‌మెంట్; జనరల్ అడ్మినిస్ట్రేషన్; సేల్స్ అండ్ మార్కెటింగ్; డేటా అనలిటిక్స్; బిజినెస్ స్ట్రాటజీస్ ప్రొఫైల్స్ ముందంజలో ఉంటున్నాయి.

ఎందుకంత క్రేజ్

సమ్మర్ ప్లేస్‌మెంట్స్ పేరిట కంపెనీలు ఐఐఎంల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఆఫర్స్, రూ.లక్షల్లో స్టయిపండ్ ఇవ్వడానికి కారణం ఏంటి? అంటే వినిపిస్తున్న సమాధానం.. ఈ ఇన్‌స్టిట్యూట్‌ల విద్యార్థులకు రియల్ టైమ్ నైపుణ్యాలు, అప్‌డేటెడ్ నాలెడ్జ్ ఉంటుందని ఆయా సంస్థలు భావించడమేనన్నే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇక్కడ బోధన విధానాలు అత్యున్నత స్థాయిలో ఉంటాయి. విద్యార్థులను కార్పొరేట్ లీడర్లుగా తీర్చిదిద్దే విధంగా కరిక్యులం ఉంటుంది. అందుకే ఈ ఇన్‌స్టిట్యూట్స్ నుంచి ఇంటర్న్ ట్రైనీలను నియమించుకునేందుకు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని పేర్కొంటున్నారు.

పూర్తిస్థాయి కొలువుకు మార్గం

సమ్మర్ ప్లేస్‌మెంట్స్ ట్రైనింగ్ సమయంలో విద్యార్థులు చూపే పనితీరు ఆయా సంస్థల్లో పూర్తిస్థాయి కొలువుకు మార్గంగా నిలుస్తుంది. ఎస్‌పీఓ దక్కించుకున్న అభ్యర్థులు ట్రైనీగా ప్రతిభ చూపితే.. అదే సంస్థలో శాశ్వత నియామకం సొంతం చేసుకునే అవకాశం కూడా ఉంది. ఇంటర్న్‌షిప్ చేసిన సమయంలో తమకు కేటాయించిన విధులు, విభాగాల్లో తమ సామర్థ్యాలను, నైపుణ్యాలను ప్రదర్శించిన వారికి కంపెనీలు ముందుగానే ఆఫర్స్ ఖరారు చేస్తున్నాయి. ఇలాంటి అభ్యర్థులకు ద్వితీయ సంవత్సరం చివర్లో నిర్వహించే ఫైనల్ ప్లేస్‌మెంట్స్ ప్రక్రియల్లో పాల్గొనకుండానే ఫైనల్ ఆఫర్ లభిస్తుంది.

ఫైనల్ ప్లేస్‌మెంట్స్

ప్రస్తుతం సమ్మర్ ప్లేస్‌మెంట్ ట్రెండ్స్‌ను పరిగణనలోకి తీసుకుంటే.. ఫైనల్ ప్లేస్‌మెంట్ ప్రక్రియ కూడా ఆశాజనకంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సంస్థల వ్యాపారాలు పుంజుకుంటున్నాయని, అవి తమ కార్యకలాపాలు విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాయని క్యాంపస్ ప్లేస్‌మెంట్ వర్గాలు పేర్కొంటున్నాయి. అందుకు అవసరమైన స్కిల్స్ ఉన్న వారిని నియమించుకునేందుకు ప్లేస్‌మెంట్స్‌కు వస్తున్నాయని చెబుతున్నారు.

ఇతర బి-స్కూల్స్‌లోనూ

ఐఐఎంలతోపాటు దేశంలోని ఇతర ప్రముఖ బి–స్కూల్స్‌లోనూ ఈ ఏడాది సమ్మర్ ప్లేస్‌మెంట్ డ్రైవ్స్ ఆశాజనకంగా ఉండనున్నాయి. అలాగే మరో ప్రముఖ బీస్కూల్ ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ–జెంషెడ్‌పూర్‌లోనూ వంద శాతం ఇంటర్న్‌షిప్ ఆఫర్లు లభించాయి. అంతేకాకుండా రెండు నెలల వ్యవధికి ఇచ్చే స్టయిపండ్ కూడా గరిష్టంగా రూ.3.5 లక్షలుగా నమోదవడం విశేషం. అదే విధంగా ఢిల్లీ యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలోనూ ఎంబీఏ విద్యార్థులకు బెస్ట్ ఆఫర్లు లభిస్తాయని భావిస్తున్నారు.

ఇల్లెందు సీపీఎం అభ్యర్థిగా దుగ్గి కృష్ణ

ఇల్లెందు: పొత్తుల యత్నాలు ఫలించకపోవడంతో సీపీఎం ఈసారి ఒంటరిగానే బరిలోకి దిగుతోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో 19 స్థానాల్లో పోటీ చేయనున్నట్లు ప్రకటించగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు స్థానాలకు గతంలోనే అభ్యర్థులను ప్రకటించారు. తాజాగా ఇల్లెందు నుంచి కూడా పోటీ చేయనున్నట్లు వెల్లడించి దుగ్గి కృష్ణను అభ్యర్థిగా ఖరారు చేశారు.

వ్యవసాయం కుటుంబం నుంచి..

ఏళ్ల తర్వాత ఇల్లెందు నుంచి సీపీఎం ఈసారి పోటీ చేయబోతోంది. సీపీఎం అభ్యర్థి కామేపల్లి మండలం మద్దిగూడెం గ్రామానికి చెందిన పార్టీ ఖమ్మం జిల్లా కమిటీ సభ్యుడు దుగ్గి కృష్ణను ఎంపిక చేశారు. వ్యవసాయ కార్మిక కుటుంబం నుంచి వచ్చిన కృష్ణ 1991లో సీపీఎం సభ్యత్వం తీసుకున్నారు. 1994 నుంచి పూర్తి కాలం కార్యకర్తగా పనిచేస్తున్న ఆయనకు భార్య ఇద్దరు పిల్లలున్నారు. కామేపల్లి మండల కార్యదర్శిగా పదేళ్లు పని చేయడంతో పాటు వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘంలోనూ పనిచేశారు. 2002లో జరిగిన భూపోరాటంలో పాల్గొన్న కృష్ణ 56 రోజుల పాటు జైలు జీవితం గడిపారు. ఆదివాసీ, గిరిజన ఉద్యమాలు, పోరుయాత్రల్లో పాల్గొన్న కృష్ణ ప్రస్తుతం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు.

ఐఈడీ పేలుడులో జవాన్‌కు గాయాలు

ఛత్తీస్‌గఢ్‌లో పలుచోట్ల ఎదురుకాల్పులు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీకి మంగళవారం తొలివిడత ఎన్నికలు జరిగాయి. దీంతో మావోయిస్టులు తమ ఉనికిని చాటుకునేందుకు యత్నించారు. సుక్మా జిల్లాలోని తోండమార్కలో పోలింగ్ ప్రారంభమైన కాసేపటికే ఐఈడీ బాంబు పేల్చారు. దీంతో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ బెటాలియన్‌కు చెందిన శ్రీకాంత్ గాయపడినట్లు ఎస్పీ కిరణ్‌చవాన్ తెలిపారు.

పలుచోట్ల ఎదురుకాల్పులు..

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లాలో తొలివిడత ఎన్నికలు జరుగుతున్న నేపథ్యాన మంగళవారం పలుచోట్ల మావోయిస్టులు–భద్రతా బలగాల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. కుంట పోలీస్‌స్టేషన్ పరిధి బండ పోలింగ్‌స్టేషన్ సమీపాన డీఆర్‌జీ జవాన్లు, మావోల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఇక పదొడ, తాడ్మెట్ల, లంకాపాల్‌లోనూ ఎదురుకాల్పులు జరగగా, మినప వద్ద జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. కాగా, సుక్మా జిల్లా కుంట పోలీస్‌స్టేషన్ పరిధిలోని దూర్మ, సింగారం సమీపంలో ఎన్నికల సిబ్బంది వద్ద ఉన్న ఈవీ ఎంలను ధ్వంసం చేయడానికి మావోలు ప్రయత్నించగా భద్రతా బలగాలు సిబ్బందికి రక్షణ కల్పిస్తూ సురక్షితంగా కేంద్రాలకు చేర్చారు.

తరచూ అవాంతరాలే..!

- కేటీపీఎస్ 7వ దశలో నిలిచిన 800 మెగావాట్ల విద్యుదుత్పత్తి
- టర్బైన్ వైబ్రేషన్‌లే అసలు సమస్య
- రోజుకు 19.2 మిలియన్ యూనిట్ల ఉత్పత్తికి విఘాతం
- జెన్‌కోకు రూ.కోట్లలో నష్టం



కేటీపీఎస్ 7వ దశ కర్మాగారం

పాల్వంచ : కేటీపీఎస్ 7వ దశలో తరచూ విద్యుదుత్పత్తికి అవాంతరాలు ఎదురవుతున్నాయి. నిర్మాణం పూర్తయిన నాటి నుంచి అత్యధికంగా వైబ్రేషన్స్ (ప్రకంపనలు) కారణంగానే ఉత్పత్తి నిలిచిపోతోంది. సూపర్ క్రిటికల్ టెక్నాలజీ కలిగిన 12వ యూనిట్‌లో 800 మెగావాట్ల ఉత్పత్తి నిలిచిపోవడంతో జెన్‌కోకు రోజుకు రూ.కోటి మేర నష్టం వాటిల్లుతోంది. బీహెచ్‌ఈఎల్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ యూనిట్‌లోనే అత్యధికంగా ఉత్పత్తి అవాంతరాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ యూనిట్‌లో ఉత్పత్తి రాకపోవడంతో రాష్ట్ర గ్రిడ్‌పై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. అయితే గత గురువారం ఉత్పత్తి నిలిపివేయగా మరో వారం రోజుల పాటు ఈ యూనిట్‌లో ఉత్పత్తి వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. దీని కారణంగా రోజుకు 19.2 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తికి విఘాతం కలుగుతున్నట్లు తెలుస్తోంది.

తక్కువ లోడ్‌తో యూనిట్..

యూనిట్ టర్బైన్‌లో తరచూ వైబ్రేషన్లతో కొట్టుమిట్టాడాల్సి వస్తోంది. దీని కారణంగా 800 మెగావాట్లకు గాను తక్కువ లోడ్ తీసుకుంటున్నారు. పూర్తి స్థాయి ఉత్పత్తి చేపడితే వెంటనే వైబ్రేషన్లు అధికమై అవాంతరాలు ఎదురవుతున్నాయి. గత ఏడాది యూనిట్‌లో 85 రోజుల పాటు ఉత్పత్తి నిలిపివేసి వార్షిక మరమ్మతులు చేశారు. అప్పుడు ఉత్పత్తి తీసుకొచ్చిన రెండు నెలల కాలంలో ఐదుసార్లు బాయిలర్ ట్యూబ్ లీకేజీ ఏర్పడి ప్రొడక్షన్ నిలిచిపోయింది. అయితే వార్షిక మరమ్మతులు సైతం 45 రోజుల్లో చేయాల్సి ఉండగా 85 రోజుల పాటు చేశారు. అప్పటి నుంచీ తరచూ వైబ్రేషన్ సమస్య వెంటాడుతూనే ఉంది. అయితే ఇది ఇంజనీర్ల వైఫల్యమా, ప్రణాళిక లోపమా అనే దానిపై యాజమాన్యం దృష్టి సారించాల్సి ఉందని పలువురు అంటున్నారు.

యూనిట్‌పై పలు రకాల ఆరోపణలు ?

యూనిట్ నిర్మాణం లోపభూయిష్టంగా చేశారనే ఆరోపణలు సైతం వెల్లువెత్తుతున్నాయి. సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించిన ఈ యూనిట్ పూర్తి స్థాయి సామర్థ్యాన్ని పాటించలేక పోతోంది. ఇతర యూనిట్లు రికార్డ్ స్థాయిలో ఉత్పత్తిని కొనసాగిస్తుండగా ఈ యూనిట్ మాత్రం అధికారులకు తలనొప్పిగా మారిందని చెబుతున్నారు. ప్రస్తుతం టర్బైన్ వైబ్రేషన్స్ 9, 10, 11 మిల్లిమీటర్ ఫర్ సెకన్‌గా నమోదవుతున్నాయి. నిబంధనల మేరకు వైబ్రేషన్స్ 3, 4, 5 మిల్లిమీటర్ ఫర్ సెకన్ మాత్రమే ఉండాల్సి ఉంది. అయితే ఈ యూనిట్ మరమ్మతుల కోసం బీహెచ్‌ఈఎల్‌కు చెందిన నిపుణులు వచ్చి పరిష్కరించేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలుస్తోంది. వైబ్రేషన్స్‌ను అదుపులోకి తీసుకొచ్చినా కూలింగ్‌కు తీసుకురావడానికి వారం రోజులు పట్టే అవకాశం ఉండటంతో ఉత్పత్తి మరో వారం పాటు నిలిచిపోనుంది. ఈ విషయమై ఎస్‌ఈ ఎం.శ్రీనివాసరావును వివరణ కోరగా వైబ్రేషన్స్ కారణంగా ఉత్పత్తి గత గురువారం నిలిపామని, టర్బైన్ కూలింగ్ కావడానికి వారం పడుతుందని, అనంతరం తిరిగి ఉత్పత్తిని ప్రారంభించి రాష్ట్ర గ్రిడ్‌కు అనుసంధానం చేస్తామని చెప్పారు. సీఈ పి.వెంకటేశ్వరరావును వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

అరుణాచలం భక్తులకు ప్రత్యేక బస్సులు

- గిరిప్రదక్షిణకు వెళ్లే వారి కోసం ఏర్పాటు
- ఖమ్మం రీజియన్ నుంచి మూడు బస్సులు

ఖమ్మంమామిళ్లగూడెం: కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈ నెల 27న అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ సూపర్‌లగ్జరీ బస్సులు నడిపిస్తున్నట్లు ఖమ్మం రీజినల్ మేనేజర్ సీహెచ్ వెంకన్న తెలిపారు. ఇందుకోసం టూర్ ప్యాకేజీ ప్రవేశపెట్టామని వెల్లడించారు. అన్ని చార్జీలు, బోర్డర్, టోల్ టాక్సులు కలిపి నాలుగు ఆలయాల సందర్శనతో ఈ ప్యాకేజీ ఉంటుందని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా భక్తుల సౌకర్యార్థం ఖమ్మం, సత్తుపల్లి, భద్రాచలం డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడిపిస్తామని పేర్కొన్నారు.

బస్సుల వివరాలు...

■ ఈనెల 25న ఖమ్మం బస్టాండ్ నుంచి రాత్రి 7 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు (సర్వీస్ 64064) బయలు దేరుతుంది. వైరా, తల్లాడ, కల్లూరు, వీఎం బంజర్, విజయవాడ, కాణిపాకం మీదుగా 27న అరుణాచలం చేరుకుంటుంది. అక్కడ గిరి ప్రదక్షిణ అనంతరం బయలుదేరి 28న ఖమ్మం చేరుకుంటుంది. ప్రయాణపు చార్జీ ఒక్కొక్కరికి రూ.4,100గా ఖరారు చేశారు.

■ సత్తుపల్లి నుంచి 25న రాత్రి 7 గంటలకు బస్సు(సర్వీస్ 99599) బయలు దేరుతుంది. ఈ బస్సు వీఎం బంజర్, విజయవాడ, కాణిపాకం మీదుగా ఉంటుంది. 27న గిరిప్రదక్షిణ అనంతరం మధ్యాహ్నం 2గంటలకు బయలుదేరి 28న ఉదయం 7గంటలకు సత్తుపల్లికి చేరుతుంది. ప్రయాణపు చార్జీ ఒక్కొక్కరికి రూ.3,690గా నిర్ణయించారు.

■ భద్రాచలం బస్టాండ్ నుంచి 25న రాత్రి 8 గంటలకు బయలుదేరే బస్సు (సర్వీస్ 55555) వీఎం బంజర్, విజయవాడ, కాణిపాకం మీదుగా అరుణాచలం చేరుకుంటుంది. ఈ నెల 27న గిరిప్రదక్షిణ అనంతరం 28న తిరిగి బయలుదేరి 28న ఉదయం 7 గంటలకు భద్రాచలం వస్తుంది. ఇందులో ప్రయాణానికి రూ.4,100గా చార్జీ నిర్ణయించారు.

■ అరుణాచలం వెళ్లే భక్తులు సమాచారం కోసం 99482 46319, 99592 25979, 99592 25965 (ఖమ్మం), 95539 90399 (భద్రాచలం), 95507 67375 (భద్రాచలం) నంబర్లలో సంప్రదించాలని ఆర్‌ఎం సూచించారు.

రిఫైనరీ సిద్దిపేటలోనే..

అశ్వారావుపేట: ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యాన కొత్తగా సిద్దిపేటలో ఫ్యాక్టరీ, రిఫైనరీ నిర్మిస్తున్నట్లు ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి వెల్లడించారు. రవాణా ఖర్చులు అధిగమిస్తూ హైదరాబాద్‌లో మార్కెట్ చేసేందుకు అనువుగా ఉంటుందని ఈ నిర్ణయం తీసుకున్నామే తప్ప మరే కారణం లేదని వెల్లడించారు. ఈ విషయంలో రైతులు అపోహలు విడనాడాలని ఆయన కోరారు. అశ్వారావుపేటలోని ఆయిల్‌పామ్ గెస్ట్‌హౌస్‌లో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో ఈ ఏడాది 45 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు విస్తరించేందుకు ప్రణాళిక రూపొందించామని చైర్మన్ వెల్లడించారు. ఖరీఫ్‌లో 27 వేల ఎకరాల్లో పంట నాటడం పూర్తి కాగా, రబీలో మిగిలిన లక్ష్యాన్ని చేరుకుంటామని తెలిపారు. గతేడాది ఆయిల్ రికవరీ 19.32 శాతం ఉండగా ఈ ఏడాది 19.02 శాతానికి పడిపోయిందని చెప్పారు. మే, జూన్ నెలల్లో అధిక ఎండలు ఉండటంతో పాటు జూలైలో అధిక వర్షాల కారణంగా ఈ పరిస్థితి ఎదురైనట్లు భావిస్తున్నామన్నారు. డీఓ బాలకృష్ణ, మేనేజర్ కల్యాణ్, రైతు సంఘం నాయకుడు శీమకుర్తి వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఫ్యాక్టరీని సందర్శించిన చైర్మన్

దమ్మపేట: అప్పారావుపేటలోని ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి సందర్శించారు. ఫ్యాక్టరీ సామర్థ్యాన్ని 90 టన్నులకు పెంచుతున్న నేపథ్యాన బాయిలర్, వ్యర్థాలను శుద్ధిచేసే ప్లాంట్ పనులను పరిశీలించి త్వరగా పూర్తయ్యేలా పర్యవేక్షించాలని అధికారుల కు సూచించారు. తొలుత లింగాలపల్లిలో గొర్రెగుట్ట లక్ష్మీనర్సింహాస్వామిని దర్శించుకున్నారు. ఫ్యాక్టరీ మేనేజర్ కల్యాణ్, రాజేశ్, గోపాల్, శివ పాల్గొన్నారు.

రామాలయంలో వెండి, స్వర్ణాభరణాల లెక్కింపు



వెండి ఆభరణాలను పరిశీలిస్తున్న అధికారులు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం వెండి, బంగారు ఆభరణాల లెక్కింపు జరిగింది. హైదరాబాద్ నుంచి వచ్చిన ఆడిటింగ్ అధికారులు, ఆలయ ఈఓ రమాదేవి, అధికారుల సమక్షాన స్వామి వారికి ఉన్న ఆభరణాలు, వస్తువుల లెక్క సరిచూశారు. ఈఓగా రమాదేవి బాధ్యతలు స్వీకరించిన సమయంలో ఓసారి చేపట్టిన ఆడిటింగ్‌కు ఇది కొనసాగింపుగా నిర్వహిస్తున్నారు. లెక్కింపు బుధవారం సైతం కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ఆడిటింగ్ అధికారులతో పాటు ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, ఏఈఓలు శ్రవణ్‌కుమార్, భవానీరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత నిత్యన్నదానానికి విరాళం

శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు మంగళవారం విరాళం అందజేశారు. హైటెక్ సిటీకి చెందిన మడి రాజు రూ.లక్ష నగదును అధికారులకు అందజేశాక, స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ సాయిబాబా, దాత కుటుంబీకులు పాల్గొన్నారు.

బోనస్ ఎప్పుడిస్తారో?

ఇంకా సర్క్యులర్ విడుదల చేయని యాజమాన్యం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులకు ఏటా దీపావళి (ప్రొడక్షన్ లింక్ రివార్డ్–పీఎల్‌ఆర్) బోనస్ పండుగకు వారం ముందు చెల్లించటం ఆనవాయితీ. కానీ, గత అక్టోబర్ 8న ఢిల్లీలో జాతీయ కార్మిక సంఘాల (జేబీసీసీఐ)తో కోలిండియా యాజమాన్యం జరిపిన చర్చల్లో ఈ ఏడాది దీపావళి బోనస్‌గా రూ.85,000 చెల్లించేందుకు అంగీకరించిన విషయం విదితమే. అయినప్పటికీ సింగరేణి యాజమాన్యం ఇప్పటివరకు తేదీని ప్రకటించలేదు. దీనిపై సింగరేణి డైరెక్టర్ (పా) ఎన్.బలరామ్‌ను వివరణ కోరగా.. కార్మికులకు పండుగకు ముందే బోనస్ ఇప్పించే ప్రయత్నంలో యాజమాన్యం ఉందని తెలిపారు.